ఆంధ్రులకథలు.

(ఆంధ్రరాష్ట్రమునుండి)

ప్రకాశకులు:

శ్రీవత్సవాయి రాయజగపతివర్మగారు.

కాకినాడ.

కాకినాడ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడెను.

1932

 [వెల 0-12-0

పీఠిక.

మా ఆంధ్రరాష్ట్రపత్రికలోని ఆంధ్రదేశకథలను దొర తనమువారు లైబ్రరీల కుపయుక్తముగమాత్ర మంగీకరించు టవలన ఆ పత్రికలోనే ప్రకటింపబడిన యీ కథలనుకూడ ఆంధ్రులకథ లనుపేరుతో ద్వితీయముద్రణము గావించి ప్రక టించి రెండును కలిపి పాఠశాలాయోగ్యమగు పఠనీయ గ్రంథములుగ చేయుటకు ప్రయత్నించ దలచితిని.

ఇందు పలువురు గ్రంథకర్తలు వ్రాసినకథలు చేర్చ బడుటవలన, వివిధరుచులుగలిగి ఆంధ్రుల సాంఘికజీవనము సుబోధ్యమగుటకు తోడ్పడునని ఆశించుచున్నాను.

ఇందలి జనానాలో జయచంద్రుడను కథ చిన్నకథలు వ్రాయుటలో నే జేసిన ప్రథమప్రయత్నము! ఆ కథనే, పెంచి వ్రాయవలెనని చాలసారులు తలచితినిగాని ఇట్టి చిన్న కథలే, దేశమునకు, భాషకు, చాల తోడ్పడగలవని తిరుగ ఆలోచించి, ఆ ప్రయత్నమునుండి విరమించితిని.

ఏకథలయినను యీరోజులలో చరిత్రగర్భితములై యుండిన దేశమున కుపయోగించునని భావించి యిట్టి కల్పిత కథలు వ్రాయుటకంటె చరిత్రప్రసిద్ధములైన జగపతుల కథ లను, గజపతుల కథలను, రెడ్డిరాజుల కథలను, వెలమవీరుల

కథలను, క్షత్రియశూరుల కథలను, కమ్మదొరల కథలను, వ్రాసియు, వ్రాయించియు, ప్రకటించిన బాగుండునని ఊహించుచున్నాను. భగవంతునిమీద భారమువేసి దేశభాషల కేదోవిధమున సేవచేయుట నా జీవిత పరమావధి అని విన్నవించుచున్నాను.

ఇట్లు,

వత్సవాయి రాయజగపతివర్మ.

కనకవల్లి.

(ని॥ వెం॥)

కనకవల్లి మిగుల దయార్ద్రిహృదయ. పట్టుదలమెండు. పదకొండు సంవత్సరముల వయస్సు. వయస్సునుమించినబుద్ధి, బుద్ధినిమించిన గుణములు. గుణములకు వన్నెదెచ్చుసౌందర్యము. సౌందర్యమును మిటిమీరు దైవభక్తి. దైవభక్తికి సమమగు దూరదృష్టి. వీనితో నామె సుగుణవతియై యొప్పారుచుండెను. ఆమెతండ్రిపేరు వెంకటాద్రియశర్మ. తల్లినామధేయము జానకమ్మ. కనకవల్లిని గన్నతల్లియగు జానకమ్మ రెండవజానకమ్మయే! జనకుడు కేవలము లుబ్ధుడు. జానకమ్మ పాతివ్రత్యమునకు గనియగు మృగేక్షణయని స్త్రీలందరామెను శ్లాఘించుచుందురు. కాని యీదంపతుల ముద్దుముచ్చట్లు చెప్పకొననివా రాయూరలేరు. అది మనకప్రస్తుతము.

ఒకనాడాలోభియగు భర్తయును, గుణవతియగు నాజానకమ్మయును డాబామీద రాత్రి పదిఘంటలవేళ మాటలాడుకొనుచుండిరి. జానకమ్మ భర్తతో ఏమండీ, మన కనకవల్లి పదకొండు సంవత్సరములుదాటి ఆరుమాసములు కావస్తూంది. నేనెన్నిమారులు చెప్పినా మీరు వినుపించుకొనుటలేదు. తుదకప్రతిష్ఠ పాలౌతామేమో, మీరింత అశ్రద్ధగానుండ

కూడదు. అప్పు డేమనుకున్నను కార్యములేదు. నేను చెప్పే మాటలు వినండి. చిన్నతనములో పెళ్ళే అందము. తలుపు దగ్గిర పేర్లుచెప్పేటప్పుడూ, పల్లకీలో కూర్చున్నపుడూ, బంతులాడేటప్పుడు, గేదెపడ్డమోస్తరుగా యుంటే యేమిబాగుంటుంది. అదిగాక అవిడిగ్రామంలో మనబంధువుల యింటివెనుక వెంకటశాస్త్రిగారి కుమార్తెకు పెళ్ళిఅయ్యేటప్పుడు ఎదురుసన్నాహామునకు ముందుగా పిల్ల పెద్దదయినదని పెద్దపెద్దలంతా భోజనాలుకూడా చెయ్యకుండా లేచిపోయారు. ఈషుతప్పి చేసినపెండ్లి యేమిబాగుంటుంది. అదిగాక అసలు వివాయుద్దేశ్యమేమిటి ? పిల్లని యెవరికిద్దామని ? నాయభిప్రాయము చెబుతావినండి. మనకు కట్నాలువద్దు, గొడవలువద్దు, మాట్లాడక మన సోమనాథంకే యిచ్చి పెండ్లిచెయ్యండి. ఇదిగో, నే చెపుతున్నావినండి. కట్నాలు, పెద్దసంబందాలు అని యేడ్చేవాడు మా మేనమామకొడుకు తన చెల్లెలిని వేగాయమ్మపేటలో వెంపటి వెంకట్రావుకిచ్చి చేసాడు! పిల్ల, అలో, అని యేడుస్తూంది. పెద్దదయి అయిదేళ్ళయింది. వాడు రాజమండ్రిలో బియ్యే ప్యాసై అక్కడనుంచి అదేమో పరీక్ష చదవడానికి లండనుపోయాడట. ఇంకనూ రాలేదు. అక్కడెవతెనో జారదీసాడని యింక రాడనికూడా అనుకుంటున్నారు. కట్నాలిచ్చి పెళ్ళిళ్ళుచేస్తే యిల్లాగేఉంటాయి పిల్లలసంసారాలు! మన సోమనాథం బుద్ధిమంతుడు. చదువుకుంటున్నాడు. అందగాడు. వయస్సుచిన్నది. కనక వల్లిహృదయమును చూచి

కొన్నవాడు. అయితే మీరొకటంటారు. ఆతనికి మడిమా న్యాలు లేవు. ఎల్లాయిస్తానుఅని అంటారేమో చూడండి. సోమనాథంనకు తల్లిదండ్రులు చిన్నతనములోపోతే మీరే పెంచినారుకదా, చదువు చెప్పించుచున్నారుకదా ఇవన్నీ గొప్పవికావు. పిల్లనిచ్చి పెండ్లిచేయుటకన్న పారమార్థికము లేదు. మీమాటకెదురుచెప్పడు. మొన్న స్కూల్ ఫైనల్ (School Final) పరీక్షలో ఫస్టుగా ప్యాసయినాడు. వాళ్ళ బ్రిదుకు వాళ్ళుబ్రతుకుతారు. మనకు పిల్లలు కనకవల్లితప్ప యింకెవ్వరు లేరుకదా! ఎల్లాతిన్నా యిదంతా దానికేకదా! అందుకు మీకు యిష్టములేకపోతే నాతండ్రి నాకు పెండ్లికా లమందు పసుపుకుంకుమకిగ్రింద యిచ్చిన నాలుగు మెకరాల మడిచెక్క కనకవల్లికిస్తాను. ఏమి బాగుందా, మీరు తోట లు దొడ్లు సంపాదించారు. మంచి షేరీలున్నాయి. వడ్డీకివడ్డీ కట్టి ఆర్జించినడబ్బు తాకట్టుపట్టినవస్తువులు సుమారు ఖరీదుక డితే అయిదులక్షల రూపాయలుంటవికదా, మనకుదత్తము చేసుకోడము అనేమాటలేదుకదా. ఆమాట తలపెట్టవద్దు. నేనెంతచెప్పినా మీకు చీమకుట్టడంలేదు. మానాన్న నాకు ఎనిమిదవ సంవత్సరమునుండి తొందరపడి పెండ్లిచేయడం నాకుబాగా జ్ఞాపకం. మరొకమాట! కనకవల్లికూడ చిన్న పిల్లకాదు. దానితోడు పిల్లలందరు పెద్దవాళ్ళయి అత్తవారి ళ్ళకువెళ్ళడము భర్తలతో కాపురము చెయ్యడముచూచి మొన్ననాతో నాన్నకు తెలియకపోతే నాపెండ్లిమాట నీవే

నా చెప్పకూడదా, అని అడిగింది. దానితప్పేమి లేదు. ఈడు వచ్చినపిల్ల తప్పంతామందే అని మనస్సులో ఉన్నదంతా చెప్పింది.

వెంకట్రాయశర్మగారు యిదంతావిన్నారు. లోభికనుక డబ్బుఖర్చుమాట, పెండ్లిసంగతి, పిల్లని బీదవాడికివ్వడము, ఈమాటలన్ని విని చాలా ఆగ్రహామువచ్చి భార్యను కనవల్లి కింకను పదుకొండో యేడు దాటలేదుకదా! నివ్వది నాపెళ్ళి మాట యేమనిఅడిగిందా? నీకు బుద్ధిలేక యేలాగైనా మేన ల్లుడుగాడికే యిచ్చి పెళ్ళిచేయిద్దామని నీవే పన్నుగడపన్నా వు అని దూషింప మొదలుపెట్టాడు. సుఖదుఃఖములు కావటి కుండలవంటివి. వెన్నెలరోజులలో చకోరపక్షులకు సుఖముం టుంది. చీకటిరోజులలో దుఃఖాలుంటాయి! కనకవల్లికి పది రోజులనుంచి వంట్లో యేమియు బాగాలేదు. నిద్రపోవుట లేదు. తల్లితో మాటలాడదు. మందమతి యెక్కువయింది. ఆలోచన చెడింది. ఈవిధంగా మఱిపదిరోజులయినతర్వాత కనకవల్లి జీవించడం చాలాకష్టమని యిరుగుపొరుగువారు చెప్పుకోడం ఆరంభించారు. నిన్న వెంకట్రాయశర్మగారి యింటిసావిడిలో అంతాజనమే! వీధిలోఆగిన గుఱ్ఱపుబండ్లకు మోటారుకార్లకు మితేలేదు. వచ్చేవైద్యులు వెళ్లేవైద్యులు, కొంతమంది డబ్బుకు రొసరొసలాడేవారు. ఇకనేమిలాభమే లేదనికొందరు! రోగమేమిటో తెలియునేలేదని కొందరు తిరిగి పోతున్నారు; నేటివుడాక్టర్లనీ, యల్. యమ్. పి. లను పీకివేసి

దొరసానిగారిని ఉంచారు. ఆమెవచ్చి నాలుగురోజులయింది. అనేకవిధములుగా తంటాలుపడింది; తుదకొకనాటిరాత్రి జానకమ్మగారినిపిలచి యేమేమో చెవిలోచెప్పి మీభర్తగారికి చెప్పండని వెడలిపోయింది.

ఆరాత్రి భోజనసమయములో జానకమ్మ వెంకట్రాయశర్మగారితో దొరసాని తనతో చెప్పినసంగతులు జాగ్రత్తగా చెప్పింది. దొరసానికూడా నాలుగుతిట్లు తిట్టి వారిద్దరు కనకవల్లియున్న గదిలోకి రాబోవుతుంటే దొరసాని వారిపావిడిలోనుంచొని వారికి సలాముపెట్టింది. వారు ముగ్గురూకలసి కనకవల్లిపరున్న గదిలోకివెళ్ళిరి. అప్పుడు దొరసాని, వెంకట్రాయశర్మగారూ, మీఅమ్మాయి విషయమయి ఒకసంగతి చెపుతానువినండి. నేను ఎల్. యమ్. యస్ పరీక్షప్యాసయి యేడేండ్లయింది. అనేక కేసులు బాగుచేసాను. సాధారణముగా డాక్టర్లకు యిల్లాటికేసు దొరకదు. ఇది టైఫాయిడ్ జ్వరముకాదు. అదయితే యిన్నాళ్ళు జీవింపనీయదు. మరేజ్వరమైనా నామందులు యెఫెక్టుయిచ్చి తీరుతాయి. ఇది మందులేని వ్యాధి. దీనికి మనోవ్యాధని పేరు. మిగతా సంగతులన్నీ జానకమ్మగారికి నేను చెప్పాను. చక్కని చుక్కలాటిపిల్లని పాడుచేసుకోక సోమనాధానికి వైరిచ్చి పిలిపించండి. మీరు పెళ్ళిచేసినా చేయకపోయినా పిల్లవాడ్ని ఆపిల్లకు చూపండి. అదేమందు. అని వారు చెప్పుకుంటూండగానే స్వప్నములో రెండుపెదవులతోటే సో మ నా ధా, అని కనకవల్లి పలికింది.

ఆమాటవిని తండ్రిగుండె బ్రద్దలయిపోయింది. దొరసాని వెళ్లిపోయింది. వెంకట్రాయశర్మగారు టెలిగ్రామిస్తే ముప్పావలా ఖర్చు. కవరుందాయని అనుకుంటూ కార్డువ్రాస్తే చాలునని కార్డుమీద ఉత్తరం వ్రాశినాడు; జానకమ్మ తీరుబాటయినప్పుడల్లా భర్తతో కనకవల్లి పెండ్లిమాటే చెప్పేది. ఒకనాడు వెంకట్రాయశర్మగారు జానకమ్మతో అమ్మాయి పెళ్ళివిషయములో నా ఆఖరుమాటలువిను. అమలాపురం తాలూకా అంబాజీపేటలో అజ్జరపు ఆనందముఅని ఒక పిల్లవాడున్నాడు. అతనికి ఏబదియేళ్ళని అంతాఅంటారు. నలుబదిఉంటాయి. ప్రథమకళత్రంపోయి పదేళ్ళయింది. ముప్పదిగరిసెల ధాన్యమువచ్చే భూమిఉంది. పదునైదువేలరూపాయల వడ్డీ వ్యాపారము. ఏమైనాఒక్కడే? ఆతోటలో అమ్మాయినుంచుంటె చాలును. అతనికున్న క్షయరోగం కుదిరిపోయిందని వాకపు తెలిసింది. ముండనుంచుకొన్నాడంటారు కాని ఉంటే మనకేమి? పెండ్లి నేగుళ్ళోనో ఒకపూటలో కావాలి మా పిల్లను చేసుకుంటానని నాకువ్రాశాడు, అందుకుతప్పక అతనికే యిస్తాను.

జానకమ్మ రుసరుసలాడుతూ పోయి సోమనాధము అక్కడనుంచి (విశాఖపట్టణము) రావాలంటే ఏలావస్తాడు. డబ్బేది. అని పొరిగింటికెళ్లి 15 రూపాయలు అప్పుతెచ్చి జానకమ్మ పంపించింది. సోమనాధము రాలేదేమి ఉత్తరమువ్రాసి నాలుగురోజులయినది. అని అనుకుంటూంటే వెంకట్రా

యశర్మగారిపిల్ల నీయదలచుకున్న ఆనందము పోయినట్లుత్త రము వచ్చింది. దానికోసము వెంకటార్యశర్మగారు బెంగ తోనున్నారు.

ఇంతలో సోమనాథం వచ్చేడు. వెంకటార్యశర్మ గారు సోమనాథాన్ని రైలుఖర్చు టిఫెన్ ఖర్చు పెట్టుకొచ్చే వా, ఎక్కడికి అని అడగడం మొదలిడితే జానకమ్మ యిప్పు డేనాయని లోపలికి తీసుకుపోయి కనకవల్లినిచూపించింది. సోమనాథం కళ్ళనెంబడి నీళ్ళుకారిస్తే ఓర్వలేక బావవచ్చా డని కనకవల్లికి నివేదించింది.కనకవల్లి ఆమాటవిని ఒత్తిగిలింది!

సోమనాథంవచ్చి పదిరోజులయింది. కనకవల్లికి కొం చెము ఆరోగ్యము కలుగుతూంది! జానకమ్మ లేనిసమయము లో సోమనాథము కనకవల్లి చక్కగా మాట్లాడుకునేవా రు. ఆమెమొయ్యారము వదనకాంతి హంసనడకవంటినడక పూలగుత్తులవంటి చేతులు, వచ్చియురాని యౌవనమును దెలుపు చిహ్నాలు, యివిచూచి సోమనాథముభావపరంపర లు యెక్కువైపోయినాయి!

అదృష్టము కనకవల్లిదే. శరీరారోగ్యము కలిగింది. తుదకు దైవఘటనచొప్పున కనకవల్లి సోమనాథముల వివా హము మంగళతూర్యారావములతో శుభప్రదముగ జరిగె ను. అదృష్టమనగా కనపడని శుభప్రదమగు వస్తువ అని చె ప్పుటకు సందేహమేమున్నది ?

హృదయ.

(కం. రా)

హృదయ పండ్రెండేండ్ల యీడుగల బ్రాహ్మణబాలిక. చక్కనిశరీరచ్ఛాయ; కుటిలకుంతలములు, విశాలములగు కాటుకకన్నులు, సొగసులు గులుకు అంగసౌష్ఠవము గలిగి కన్నవారికి ముచ్చటలొలికించు చుండును. తలిదండ్రుల కామెయొక్కతియే కొమరిత యగుటచే నల్లారుముద్దుగా బెరుగుచుండెను. తండ్రి హూణభాష నభ్యసింపవలెనని యొక పట్టణ పాఠశాలయందు బ్రవేశించెను గాని, దేహారోగ్యము చెడుటవలన జదువు జాలించి తనకున్న పిత్రార్జితక్షేత్రము సేద్యముజేసికొని జీవించుచున్నాడు. పిత్రార్జితమంతగా లేకపోయినను తాతలనాటినుండియు వచ్చినగౌరవసంపాదనాకుతూహల మాతనియందు విశేషముగ నాటియున్నది. అతని భార్యయు పేరుప్రఖ్యాతులు గలిగినవారింటి యాడుపడుచు. అందుచే నామెకును విశేషముగు ధనకాంక్ష లేదు. కాని గౌరవహేతుకములని భావింపబడువానికి గుడిమెడమ లాలోచింపక ధనవ్యయము జేయునిచ్ఛ మెండు. వీరిది యశోపురము కాపురము.

యశోపురమునం దొక చిన్నపాఠశాలగలదు. అందు సుమారఱువది వత్సరముల వృద్ధు డుపాధ్యాయుడుగా నుండెను. అతనిబోధనము పూర్వపుఫక్కి. సాయంసమయమునం

దా పాఠశాలకు ముందుగనున్న పచ్చికబయలునందు బిల్లల నందఱఁజేర్చి వీరులయొక్కయు, వీరవనితలయొక్కయు, బతివ్రతాశిరోమణులయొక్కయు జరిత్రలను కథలుగాఁ జెప్పుట యతనికలవాటు. ఆతఁడు చదువుకంటె శీలము నెక్కుడుగ భావించుచుండుటచే నాపాఠశాలలోని బాలబాలిక లందు నిమిత్తమై యెక్కువశ్రద్ధ దీసికొనుచుందురు. హృదయ యాపాఠశాలయందు జదువుచుండెను. ఆమె కుమారీశతకము, సుమతీశతకము, రుక్మిణీకళ్యాణము మున్నగు శతకములను బఠించెను. చక్కఁగ చదువను వ్రాయను శక్తియలవడఁ జేసికొనెను. ఆమె సహజముగ జక్కనిదియగుటచే నీవిద్యాగంధమామెవిషయమున బసిడికి దావియబ్బినభాతి నున్నదనిన సత్యమునకు దలవంపురాదు. పన్నెండువత్సరములు వచ్చునరికే నలుఁగు రామెను బుద్ధిమంతురాలని జెప్పుకొనుచుండిరి.

ఈకాలమున గుమారీజనన మనినంతనే యరుచి తోఁపకమానదు. కుమారికి పదిసంవత్సరముల ప్రాయమువచ్చువఱకు నాబాల ముద్దుముచ్చట లింపుగానుండినను వివాహవిషయము వచ్చునరికి చింత జనింపక తీరదు. అదియే హృదయ తలిదండ్రులగు వసుమతీ వసంతులకిపుడు మనోవ్యథ గలిగించిన విషయము. వారు సంబంధముకొఱకు వెదకుచు కుదురక విసుగుకొనుచు మగపిల్లలు కలుగువారిదే యదృష్టముకదా యని యితరుల మెచ్చుకొనుచునుండిరి. కూతునకు ద్వాదశ

వత్సరములువచ్చిన తరువాత మెల్లగనాలోచింప వచ్చునని యుపేక్షచేయుట కికవీలు లేదు. వసంతుడు వెదకివెదకి తుద కు, గౌరవనీయమగు కుటుంబములోని వాడును ప్రవేశపరీక్ష (School Final) యందు త్తీర్ణుడైనవాడును నాగరికపురవా సియునగు విశారదునకిచ్చి వివాహముజేయ నిశ్చయించెను. విశారదునితండ్రి మండలాధికారియొద్ద ముప్పదియైదు రూపా యిల యుద్యోగమునందుండి కొంతకాలముక్రిందట యకాల మృత్యువువాతబడి కాలముజేసెను. తల్లియే విశారదునిబెం చి పెద్దవానినిజేసి విద్యజెప్పించుచుండెను. రెండువేల రూప్య ములు కట్నమిచ్చుటకును; వియ్యపురాలు లాంఛనములుగ నాలుగువందలిచ్చుటకు నేర్పఱచుకొని విశారదుడు సంబంధ ము నిశ్చయించుకొనెను. వితంతువునకు వియ్యపురాలు లాం ఛనములేమియని సందేహము తోచవచ్చును. కట్నములే ప్రధానముగా జేసికొనువారికి న్యాయాన్యాయవిచక్షణ యుండదు.

౨

వివాహదినము సమీపించినది. ప్రయత్నము లతిచు ఱుకుగా జరుగుచుండెను. వసుమతీవసంతు లిరువురు కీర్తికా ములగుటచేతను, చాలబలగము గలిగిన పెండ్లివారు తరలివ చ్చెదరని తెలియుటచేతను తలకుమీఱిన ధనము వ్యయపఱ చి వలయుసంభారముల గూర్చుచున్నారు. ఇంట నిలువలేనం

దున వసంతుడు వరశుల్కమునిమిత్తము, ఖర్చులనిమిత్తమును నాలుగువేలరూప్యములను, పత్రికాగ్రామవాస్తవ్యుడగు నాగి శెట్టియొద్ద నప్పుపత్రమును వ్రాసి బదులు తీసికొనివచ్చెను. పెండ్లివారు కట్నమును ముందుగాబంపినగాని తరలిరామని కబురుచేయుటచే నాతడు పట్టించుకొని వెళ్ళి యిచ్చివచ్చెను.

హృదయ యానందమునకు మేరలేదు. ఎట్లుండును? వివాహ మందర కానందదాయకమేకదా! వివాహానంతర గృహస్థాశ్రమమునందు కడగండ్లు పడినప్పుడెల్ల నాయాశ్రమ ము నెంతదూఱినను, అది తియ్యనై యెప్పటికప్పుడు చవుల నూరజేయు చుండుటచే బరిణయమన్న నందఱకు బరమానందమే! హృదయ చదువుకొనినదగుట హృదయమును వెల్లి గొనిన యానందము నుప్పొంగనీక యధరపల్లవముల నణచుకొనుచుండెడిది.

వివాహదినము వచ్చినది. సుముహూర్తము రాత్రియైనను, స్నాతకము జేసికొనునిమిత్తమై పెండ్లివారుదయము రెండుఘడియల ప్రొద్దెక్కుసరికే వచ్చినారు. తలిదండ్రులకు తానొక్కడేయైనను విశారదునికి తల్లివంకవారును, తండ్రివంకవారును చాలమంది బలగమున్నారు. అదిగాక యాతని కింక సంబంధము కుదురకపూర్వమునుండియు విశారద్ నీమే రేజికి మమ్ములను పిలచెదవా, యని బేరములాడుకొనిన సహాధ్యాయులును వారిమిత్రులును చాలమంది వివాహమున

కై వచ్చియున్నారు. వివాహము శోభగాంచదనియు, మిత్రులకు కాలక్షేపము కాదనియు, తల్లికూడ యీరొయొక్క కార్యమేగద మనకని పట్టుబట్టుటచేతను విశారదుడు తనపెండ్లికి వేశ్యాపురమునుండి సంగనాచి మేళమును రావించెను వీరందరును రమారమి ముప్పదిబండ్లమీద యశోపురమువిచ్చేసిరి. పెండ్లివారికి రెండుభవంతులను విడిదియిచ్చిరి. భోగమువాండ్రకు విశారదుని మిత్రులకోరికపైన విడిదికి సమీపముననే యొకయిల్లు గుదిర్చి యిచ్చిరి.

సాయంకాలమైనది. రాత్రిభోజనములైనవి. పెండ్లివారు వివాహమునకు రానూరేగుచున్నారు. చెముకీచే నలంకరింపబడిన పాలకి గాస్లైటుల వెలుగున దళతళ లాడుచున్నది. స్ఫురద్రూపియైన పెండ్లికొడుకందు నవమన్మథునివలె గూర్చుండియున్నాడు. ముందు చిత్రవిచిత్రములగు దుస్తుల ధరించి పెండ్లివారు మేజువాణి చేయించుచున్నారు. వారిదుస్తులనంటియున్న సుగంధ ద్రవ్యములనుండి వెడలెడి తావుల ధరించి గంధవహుడు సగర్వముగ నలుగడల విహరించు చున్నాడు. వెనుక నారీమణులు వివిధాంబరభూషణాధారిణులయి యొండొరులతో సరససల్లాపముల నాడుకొనుచున్నారు. కొందఱుద్యోగములుచేసి తమమగలు గణించి చేయించిన క్రొత్తవస్తువులను తోటివారికి జూపించి వారుయెన్నికాసులు, మజూరియెంత, అనివేయుప్రశ్నల కుత్తరవులిచ్చుచున్నారు. ఇకకొందఱు పిల్లలపోరుపడలేక చాకలివాం

డు) వలదని కసరుచున్నను వానినిపల్లకీలో గూర్చుండబెట్టు
చున్నారు. మఱికొందఱు తరుణవయస్కులు తాముధరించిన
భూషణాంబరములు నవీననాగరికత కనుగుణ్యములుగ నున్న
వో లేవోయని పలుమారు జూచుకొనుచు సర్దుకొనుచున్నా
రు. ఎన్నిముక్తాయింపులయినను కదలకపోవుటచే విద్యార్థుల
ను పెండ్లిపెద్దలయిన విశారదుని మేనమామలు రేపటినుండి
మీాయిష్టమువచ్చినంత యాలస్యము చేయవచ్చును. సుము
హూర్తము దాటిపోవును. పెందలకడ బోనిండని బతిమాలు
చున్నారు. ఒకయువకుడు తనమిత్రునిజూచి యాటకత్తె యభి
నయించి తన్నుపేక్షించినదని గిసిసి ముందునకుబోయి మేళ
ముదగ్గిర వారికడ్డంకిగ సన్నాయిబట్టించెను. అనేకవిధములు
గ బాణసంచాను గాల్చుచుండిరి. ఎట్టకేలకూరేగింపు టుత్స
వము పెండ్లిపందిరజేరెను.

వధూవరుల మంగళస్నానములజేయించి పీటలమీాద
గూర్చుండ బెట్టినారు. ఆచావడియందు చోటుజాలక మేళ
మును ముందుచావడియందు బెట్టినారు. వివాహము జరుగు
చుండినచావడియందు కన్యాదాతలును, పెండ్లిపెద్దయగు
విశారదుని పెద్దమేనమామయు మఱికొందఱు పేరంటాండ్రు
ను మిగిలిరి. తక్కినవా రాబాలగోపాలము చెవులనిక్కించి
గ్రుక్కుమిటకరించి, నోరులు తెరచుకొని ఉచ్ఛ్వాస నిశ్వాసము
లకైన దెరపిలేకుండ వేశ్యల యభినయమును జూచి యానం

దించుచున్నారు. పెద్దలైన వారు మువ్వగోపాలపదముల నందించుచున్నారు. పిన్నలయినవారు పార్శీమట్టుల బాడుమనుచున్నారు. లోపలవివాహ మతిచురుకుగా జరుగుచున్నది. పురోహితుడు వాయుగమనమున మంత్రము నేకరువెట్టుచు నడుమనడుమ భజంత్రీలను వాయింపుడని కేకలుపెట్టుచున్నాడు. మంగళసూత్రధారణసమయమందునను, తలంబ్రాల సమయమునందునను, తల్లులు పిల్లలను లేపి వేడుకజూపించుచున్నారు. క్రమముగ వివాహము ముగిసినది. సంభావన సమయముగుసరికి వేశ్యానృత్యము నానందించుచున్న బ్రాహ్మణబృందమంతయు లోనికివచ్చినది. ఆసందర్భమున వచ్చినపిల్లపోరాటములన్నియు సణగిపోయినతరువాత నిద్దురనుండి యిప్పుడే లేచివచ్చిన యిద్దరుబాలికలు కంఠములను సవరించుకొని రెండు పాటలనుపాడి పళ్ళెరములో నాలుగువరహాలు పడినపిమ్మట వధూవరులకు హారతినిచ్చి లేవదీసిరి. వేశ్యలకు తాంబూలమిచ్చి మరునాడుదయము పెందలకడనే రమ్మని యిద్దరుచాకండ్రను కాగడలతో జతయిచ్చి వారిబసకు బంపివేసిరి.

ప్రొద్దుసనే కాఫీ యుపమాలను సేవించి యువక లూరేగింపునకు బయలుదేరి రెండుజాములగువఱకు తిరిగి వచ్చువారుకారు. వచ్చినపిమ్మట పదిసారులు పిలిపించుకొనిగాని భోజనమునకు బయలుదేరువారుకారు. బయలుదేరి

వచ్చి వడ్డన యయినతరువాత యెవరో రావలెనని వారికొఱ
కొకరివెంట యొకరినిబంపి ఊరివారికందఱకు విసుగుబుట్టించి
వృద్ధప్రాణము లూడిపోవునన్నభయము జనింపజేసి తుదకు
రానివారు వచ్చినతరువాత జాముప్రొద్దువేళ భోజనములు
చేసి లేచెడివారు. ఇంతలో నాడుపెండ్లివారి వంటబ్రాహ్మణు
డు మగపెండ్లివారి నీళ్ళబ్రాహ్మణుని దిట్టెనని తగవుబెట్టుకొ
నువారు. వీరితగవులిట్లుండగ చంటిపిల్లలకుపాలిధకను రాలేదని
యో, వియ్యపురాలు చద్దియన్నములకు పిలువలేదనియో,
కయ్యములబెట్టుకొని యానాలుగుదినములు మందగమనలు
తమతోబాటు కలహాభోక్తకు షడ్రసోపేతముగ విందులుచే
యుచుండిరి. నాలుగుదినములు గడచి నాకబలియనంతరము
పెండ్లివారు వెడలినారు. వసుమతీవసంతులు తలదడవి చూచి
కొనినారు. ఈవివాహసందర్భమున వచ్చెడి కష్టములన్నియు
గూతుల గన్నవారికెఱుక !

3

దినములెప్పుడు నొక్కరీతిని గడువబోవు. కొమరిత వి
వాహమయిన కొలదికాలమునకే వసంతునకు కష్టములు
ప్రారంభమయ్యెను. వివాహమునకు దెచ్చినయప్పు క్రమము
[illegible] బెరిగెను. అప్పునిచ్చిన నాగిశెట్టి దాని నాస్తి మీఱినదాక
[illegible]రుగనిచ్చి పిమ్మట వసంతుని తొందరజేయజొచ్చెను. మొ
దట రహస్యముగ నడిగినను, తరువాత యెందఱిలోనున

బిలిచియడుగుచు వచ్చెను. గౌరవముగ దలయెత్తికొని తిరుగుచున్న వసంతుని కిదియంతయు దలవంపుగానుండెను. ధనముమీద వ్యాపారము నడపి పిల్లికి బిచ్చమైనబెట్టక కోటీశ్వరుల మగుదమని తలచెడువారికి పరులగౌరవము పాడయినను కొంపలుకూలినను కనికరముపుట్టదుకదా! వసంతునికి కంటకముగనున్న నాగిశెట్టికేమి? ఈఋణబాధవలన వసంతుని జీ[illegible]తములోని యుత్సాహమంతయు నశించెను. కొలదికాలముననే అతనికిగల సర్వస్వము యేలము వేయబడెను. అంతవఱకు నానందడోలికల నుయ్యాలలూగిన యాతడు భార్యతో పరపంచలు బట్టి యిక్కట్టుల గుందవలసి వచ్చెను.

ఇది యిటులుండగా వసుమతికి హృదయ తరువాత సంతానము లేక లేక యొకమగశిశువు కలిగెను. ఎట్టివారికిని యెట్టిస్థితిలోనున్నను పుత్రోదయము నయనోత్సవజనకము కదా! ఆపిల్లవాడు సంవత్సరము పెరిగి యొకనాడాకస్మికముగ చంటిపిల్లజబ్బుచూపి చనిపోయెను. లేకలేక కొమరుడుకలిగెనని మురియుచున్న వసుమతీవసంతులు హృదయవేదన వలన కృశించుచుండిరి.

ఇదియుగాక హృదయ నత్తవారింటికిబంపి మూ[illegible] [illegible]త్సరములైనను విశారదుడు మామగారు పండుగకు [illegible] జామాతను పెట్టలేదనిన కోపమున దిరిగిపంపలేదు. పైగ[illegible] గారు కోడరికము బెట్టుచున్నదనియు భర్తకు భార్య[illegible]

దనురాగము లేదనియుగూడ వసుమతీవసంతులకు దెలియవ
చ్చెను. వసంతునకు రెండుమూడు సారులు కూతును బుట్టినిం
టికి దీసికొనిరావలెనని పోయి కించతో దిరిగివచ్చెను. వసు
[illegible]తికి గడుపున జిచ్చుబెట్టి కుమారుడు చనిపోయినను, ఒ
[illegible]మారు చూచుటకైన హృదయను బంపలేదు.

నిశ్చింతగ జీవనముజేసిన వసంతునకు జీవితోపాయ
మేమియు దోచుటలేదు. కలిగిన యాపదలచేతను, పుత్రికా
వియోగజనిత విషాదముచేతను, అతనిభార్యా మంచముదిగ
క దేహారోగ్యము జెడగొట్టుకొనెను. కష్టములెప్పు డొంట
రిగ రావుకాబోలు! ఆమె యస్వస్థత, యెక్కువయి యతని
ప్రేమబంధమునకు తీరనికొదవబెట్టి యొకనాటి సాయంకా
లము పరమపదించెను. ఈయాపదతో వసంతుడు చిత్తము
చెదరి యున్మత్తుడై దేశములుబట్టి పోయెను.

౪

హృదయావిశారదులు రూపమునందును వయసునం
దు నొకరికొకరు తగియుండిరి. కాని యేమిలాభము? అవ్యా
[illegible]రాగము లేకపోయినయెడల రూపవిలాసము లోకకృత్య
[illegible] జేయుపుకదా! హృదయ కాపురమునకు వచ్చినప్పటి
[illegible]యు విశారదు డన్యప్రాంతములయందే చదువుకొను
చున్నాడు. సెలవులలో నింటికివచ్చినపుడైన హృదయయన్న
యతనికి గోపము! గుణరూపములు కలిగి కుసుమసదృశకో

మలత దనరి తరుణవయస్సున నలరుచుండిన యాముద్దుగో మ్మపై గోపముండవలసినకారణము లేదు. కాని నవనాగ రికతావిలాసికి గారణము దొరకకపోవునా? పెట్టుపోతలయం దు వసంతుడాతనికి లోపము జేయుటవలన నాతనికి మహోధ్యా యులలో దలవంపు కలిగినదట! అందుచే హృదయనేలడట! ఉచితానుచితముల గుర్తెరుంగనపు డెంతచదివిన నేమిలాభ ము? అప్పులపాలై యిక్కటులగుందుచుండిన మామగారి సత్కారలోపమునకు నవలావణ్యసుధారాశియగు హృద యను గోయుచున్న యాతని విజ్ఞానమున సుజ్ఞానమేనా?

హృదయ కాపురమునకు వచ్చుటతోడనే యత్తగారి కుబలాటము మెండయ్యెను. కోడలెప్పుడువచ్చునాయని యు వ్విళ్ళూరుచుండిన యామె కుబలాటము మెండగుట యాశ్చ ర్యముకాదు. కోడలూరక కూరుచుండిన యామెకు జెప్ప రాని కోపము. పొరుగింటికి పేరంటమునకు బోవుట కామె యుత్తరువు కావలెను. పుస్తక మామెకంట బడరాదు. ఇటు లెన్నినిర్బంధములు చేసినను హృదయ పల్లెత్తుమాటాడి వె ఱుగదు. అత్తగారు మూర్ధాగ్రేసరచక్రవర్తిని యని మె గ్రహించినది. అయినను ప్రాణము విసిగినపు డెవ నైన జెప్పుకొని యొక్కసారి యేడ్చుదమనినను తో లెవ్వరును లేరు. భర్త యన్యప్రాంతవాసియైనను గష్టము ల జెప్పుకొనుచు నొక్కజాబైన వ్రాయుదమనిన నాతనికి

దనపై జెప్పరాని కోపముకదా? ఇంటికివచ్చినపుడైన రెండు ప్రేమపూరిత వచనముల బలికిన దనకష్టములన్నియు దీరు నన్న నడియాశ మునుపే లేదు. ఆహా! హిందూదేశమునం దాడువారి జీవితమెంత కంటకావృతము? పదిరెండువత్సర ములు వచ్చువఱకు దలిదండ్రులయింట ముద్దులుగులుక బెరిగి శిరీషకుసుమసదృశసుకుమారముతో నత్తవారింట బ్రవే శించెదరు. అంతనామె ఆ, యన్న నపరాధము ఊ, యన్న ఘోరకర్మమై పరిణమించును. పురుషు డిరువదివత్సరములు వచ్చినను మెట్టి యనుచితకార్యము చేసినను చిన్నతనమట! ఆడుది పదిరెండువత్సరములకే జ్ఞానచింతన గలిగి యిలుదీర్ప సమర్థత యుండవలెనంట!! ఏమియీ చిత్రము! ఇది యెంత చిత్రముగనున్నను భారతరమణీమణులకీర్తికాంతు లందే యి మిడి యున్నవి? ఇన్నిచిక్కులమధ్య హిందూసుందరులు చూ పెడు పవిత్రవర్తనమే భరతభూమి కలంకారముగ దనరారు చున్నది. పతివ్రతాశిరోమణులయి, పరమపావనులయి స్వ చ్ఛందజీవితపూర్ణులయిన రమణీమణుల కీర్తిమీదగాక య శోవంతములగు దేశములకు నిలచుట కాధారము మరియె క్కడ?

విశారదుడు పట్టపరీక్షయందు తీర్ణుడైనాడు. ఎక్కడ నే దరఖాస్తుజేసిన నుద్యోగము దొరకకపోవుటచే నింటియొ ద్దనే యున్నాడు. వారమునకొకరూపాయము దపాలఖర్చు జేయు

చు నుద్యోగము నివ్వజాలనందుకు విచారించుచున్నామని యధికారులు వ్రాసెడి ప్రత్యుత్తరముల జదువుకొనుచుకాల క్షేపము జేయుచున్నాడు. హృదయయన్నకోపముపోలేదు. ఆమెతోమాటలాడడు. ఆమె యింటజేసెడి యుపచారముల జూచినను తలిదండ్రులకు దూరమైయున్న ఆమెదీనతగాంచి నను అతనికేమియు జాలికలుగుటలేదు. హృదయ యేమిచే యగలదు? కొంతజ్ఞానవతియగుట నామె మూర్ఖతవహించ లేదు. అన్నియు నోపికతో సహించుకొను మనోబలమును దెచ్చుకొనినది. కష్టములు కలకాలము కాపురముండవని ధై ర్యము దెచ్చుకొనుచుండెను.

ధర్మమూర్తియను బిరుదుగాంచిన భగవానున కిసు మంతయు దయలేదు కాబోలు? సన్మార్గులకు సంకటములు సంధించును. విశారదున కొకనాటిరాత్రి తలనొప్పి జ్వరము వచ్చినది. మఱునాడు పెందలకడనే యొంగిలికడి యెవరువద్ద నినను వినక కునికినాడు. నాటిరాత్రికి జ్వరముతీవ్రమై లం ఘనములలోనికిదింపి మంచము పట్టించినది. చికిత్స జేయుటకు వైద్యులు వచ్చుచున్నారు. కాని జ్వరము తగ్గుటలేదు. వారు విషమజ్వరము క్రమముగ తగ్గవలెనని యేదియో ధైర్యము చెప్పుచున్నారేకాని వారికిని ధైర్యము చిక్కుటలేదు. చాల జబ్బుగా నున్నతోడనే విశారదుని మేనమామలు మున్నగు బంధువులందరు వచ్చిరి. అదివఱకె శుష్కించుచుండిన హృద

యకు మనోవ్యథ దుర్భరమయ్యెను. రాత్రింబవళ్ళు నిద్రాహారములుమానుకొని యామె వైద్యుడు చెప్పినయుపచారమెల్ల జేయుచుండెను. దినమునకు దినము వ్యాధి పెరుగుటయే గాని తగ్గుటలేదు. ఒకరితరువాత నొకరుగా వైద్యులు చేయి విడిచి పోవుచుండిరి. చాటుచాటున హృదయ కన్నుల నీరు గ్రుక్కుచు పరమేశ్వరుని కిసుమంతైన దయలేదని నిట్టూర్పుచు గనదమ్ములగారెడి యశ్రుధారల బైటచెలగున నద్దుకొనుచుండెను. మాంసఖండము జీర్ణించి రోగియానవాలు పట్టలేని దీనస్థితిలో నున్నాడు. పెదవులెండిపోయి బీటలువారినవి. కాకిచూపు పడినది. తలవెండ్రుకలు తొల్లిటి నిగనిగలు కోలుపోయి భయోత్పాదకములుగ నున్నవి. ఒకనాడు సాయంకాల మయిదుగంటలగుసరి కాతనికాయాసము హెచ్చినది. కాలుసేతులు చల్లబడినవి. వైద్యుడు నాడిజూచి పెదవివిఱచి యావలకు పోయినాడు. బంధువులు చుట్టును జేరి రోదన మారంభించినారు. హృదయ పాదిగిటనొదిగి ముఖమువాచి దుఃఖించుచున్నది. ఎంతకష్టము దాపరించెను? ప్రాణమునకు ప్రాణమైన నాథుడు మరణశయ్యపై నున్నాడు. హృదయపేటికలో దాచిపెట్టిన తనప్రేమధనమంతయు తన సౌభాగ్యసంపద యంతయు తనజీవితమంతయు గంగపాలు కానున్నది. తానొక మహాసముద్రమధ్య బడనున్నటులున్నది. కడసారిచూపునకై దుఃఖమునదూలుచున్న యామెను

మంచముకడకు దీసికొనివచ్చినారు. విశారదునకింక స్పృహా తప్పలేదు. అటునిటు పొరలుచు భార్యనొకసారి చూచినాడు. తక్కినబంధువు లాతనికి గనబడుటలేదు. వారి యేడ్పులాతనికి వినబడుటలేదు. హృదయ యొక్కతియే కనబడుచున్నది. ఆమెయేడ్పే వినబడుచున్నది. ఆతనిదృష్టికామె మునుపటివలె గనబడుటలేదు. ఆమె ప్రేమైకరాశివలె దోచినది. ఆమెయెడ దానొనర్చిన యపరాధమంతయు గన్నులకు గట్టినట్లగపడుచున్నది. జాలి ప్రేమలొక్కసారిగ బుట్టినవి. అందుండి దుఃఖము జనించినది. అపరాధమునకు బశ్చాత్తాప పడుటకై పరమేశ్వరుని ధ్యానించుచున్నాడు కాబోలు. కనులుమూసికొనినాడు. స్పృహతప్పినది. శరీరము కదలదు. ఊపిరి యాడునటుల తోచుటలేదు. హృదయ హా! యని యెలుగెత్తియొక్కకేక వేసి పతిపాదములపై బడినది. మఱల కొలదిగ యూపిరి యాడుచున్నట్లు తోచుచున్నది. కొలది డొక్కలెగరవేయుచున్నాడు. మెల్లగ యవయవముల గదల్చుచున్నాడు. అప్పటికి ముప్పు తప్పినట్లు తోచినది.

ప్రభాతసమయమున పుష్పదళములపై నిలచిన హిమబిందుభాతి స్వచ్ఛందశీలయగు హృదయను, బరమేశ్వరుడనుగ్రహింపక పోవునా? విశారదుడు క్రిమముగ రోగము తగ్గి పథ్యము తినినాడు. మెల్లగ దేహారోగ్యము కలుగచున్నది. అతనిని హృదయ కంటికి రెప్పవోలె కాచి సంరక్షణజేయు

చున్నది. విశారదునకు హృదయమీద అద్భుతమగు ప్రేమకలిగినది. హృదయయే తనకుప్రాణదానము జేసిన మహాసాధ్వియని నమ్మకము కలిగినది. కొలదికాలమునకే యతనికిపరిపూర్ణారోగ్యము కలిగినది. హృదయకు కష్టములు గట్టెక్కనవి. చీకటిరాత్రులుగడచి వెన్నెలరాత్రులు వచ్చినవి. హృదయావిశారదుల ప్రేమబంధ మీవసంతము రాగనే చిగిర్చి నవనవలాడుచు తీగెలసాగుచున్నవి. వారిజీవితమున నూతన శకమారంభమైనది. ప్రేమోదయమైనయంతనే హృదయ తన కష్టములన్నింటిని మరచిపోయినది. వారికిజగమంతయు ప్రేమమయమైనట్లు తోచినది. ఈరేడుజగములను గట్టు పవిత్ర సూత్రము నిష్కళంకమయి, నిర్మలమయి, నిశ్చలమయి, నిరుపమాన ప్రభావంతమయిన ప్రేమయేకదా! ప్రేమకంటె విలువగలవస్తువ వేరొకటిలేదని ఋజువుచేయుట కీకథ చాలును?

వీరప్రతాపవర్మ.

(న. వెం.)

నిరుపమాన శౌర్య సాహసములను, నియమసంయములను, ధర్మాభిలాషతో గూడిన మహాత్యాగమును ప్రదర్శించుచున్న క్షత్రియులను గౌరవించని వారు హిందూ

దేశమందు శేరనుట వింతగాదు. వీరిచరిత్రను బరిశీలించి చూచినయెడల వీరియందు విరాజిల్లుచున్న సద్గుణపుంజము అనేక సంవత్సరములుగ వీరొనర్చుచున్న సాధనఫలితమని తోచుచున్నది. అదియునుంగాక క్షాత్రముచేతనే జీవించుజాతులు రాజపుటానదేశమునం దనేకములుగలవు. వానిలో క్షత్రియజాతి క్షాత్రముయొక్క సత్యార్థమును పూర్తిగాజయించి ప్రపంచకీర్తిని సంపాదించి ధన్యతగాంచినది. ఈజాతి యే వ్యక్తినిగాని, గౌరవార్హమని భావించిన, దేవతలనుబోలె నావ్యక్తిని నారాధించి గౌరవించును. ఏమాత్రమునుగాని దుష్టులు చేరినట్లు తలంచెనా వానిని ఘోరఖడ్గాగ్ని కింధనముగావించును. క్షత్రియజాతియొక్క ప్రకృతి శత్రుసాధనమునందు వజ్రముకన్న కాఠిన్యము వహించును. అనాథపోషణలయందు నవనీతముకన్నను కోమలత్వము గాంచును. ధర్మకార్యములయందు దీక్షవహించును. క్షత్రియులయందు జీవశక్తియొక్కటియే యౌజ్వల్యమును వహించి యూరకొనలేదు. సమయములందునే యర్థసాధనమునకుగాని, స్వీయసర్వస్వమును అర్పణనొనంగు ఆత్మశక్తి ప్రజ్వలింపజేయుచున్నది. గవర్నమెంటువారు మనదేశము తమయొక్క అధీనముక్రిందకు రప్పించవలెనని ప్రయత్నించినపుడు రాజపుటానా ఝాంసీ మొదలగు ప్రాంతములయందు గవర్నమెంటువారితో క్షత్రియులు ఘోరయుద్ధము లొనర్చియుండిరి. క్షత్రియులు ఖడ్గధారులై బయ

లుదేరి యుద్ధముచేసిరి. కాని, గవర్నమెంటువారు హిందూదేశమున కుపకారము చేయుటకే వచ్చియుండిరని వారు తెలుసుకొనినపుడు క్షత్రియజాతి ప్రతివ్యక్తియు గవర్నమెంటువారికి సహాయుపడెను. హిందూదేశమందు 1857 సంవత్సరములో సిపాయుల తిరుగుబాటు జరిగినప్పుడు భారతదేశమున బ్రిటిషు పతాకము పడకుండా నిల్పివేసినది యీక్షత్రియయోధులే! ఆసమయమున వీరటుదుర్గమ్మును జయించుటకుగాను గవర్నమెంటు పటాలములు వెనుకనుండి వచ్చువరకును నిలిపినది యీక్షత్రియయోధులే! సిపాయీల ముట్టడి నణచుటలో గవర్నమెంటువారి తరఫున యుద్ధముచేసి ప్రతాపవర్మ తండ్రి వీరస్వర్గమునకు జనెను. ఆయన రాజభక్తుడు. యుద్ధమునకు వెళ్ళేసమయమున కుమారునితో అబ్బాయీ! గవర్నమెంటువారు మన దేశమునకు ప్రభువులై యున్నారు. ప్రపంచమంతటను నాటుకొని యున్నారు. వారితో మనము యుద్ధముచేసి జయింపలేము. తురుష్కరాజ్యము వీరినిగురించి అడుగంటియున్నది. ఈ రాక్షసకృత్యములను జయించినవారు వీరే? వీరియెడల న్యాయపరిపాలన యెక్కువగాయున్నది. గాన గవర్నమెంటువారి తరఫున యుండుటే పరమావధి. ఒకవేళ నేను యీయుద్ధములో దురదృష్టవశమున తిరిగి రాజాలనిచో నీవు వెంటనే నాస్థానము నాక్రమించి విశ్వాసముగలవాడవై రాజభక్తుడవై, సామ్రాజ్యకార్య నిర్వహణమందు

యశస్సును సంపాదించుము. క్షత్రియవంశ మర్యాదలను నిల బెట్టుము. ద్వాపరయుగమున అర్జునుడు తనయొక్క ప్రతిజ్ఞను చెల్లించుకొని వీరస్వర్గము నొందెను.

అనిచెప్పి వీరస్వర్గముచేరెను. ప్రతాపవర్మకు సైనిక పటాలములో నొక నాయకపదవి లభించెను. తండ్రిగారి ఆజ్ఞ ననుసరించియే ప్రతాపవర్మ ప్రవర్తించెను. ఈయన ఐరోపా మహాసంగ్రామమునందు గవర్నమెంటువారి తరఫున యుద్ధ ముచేసి యుండెను. జర్మనీవారు ఫ్రాంసును ముట్టడించినపుడు ప్రతాపవర్మ తనసైన్యముతో జర్మనీయోధుల నెదిర్చి వారిని పరాజితులచేసి యుండెను. కాని ఆయుద్ధములో ప్రతాపవర్మ యొక్క 2 కాళ్ళును తెగిపోయెను. గవర్నమెంటువారు ప్రతాపవర్మయొక్క శౌర్యమును త్యాగమును గౌరవించి యుప కారవేతన మొసంగిరాజపుటానాకు యితని స్వగృహమునకు పంపివేసిరి. ప్రతాపవర్మ ఉపకారవేతనము అనుభవించుచు తన జీవితము గడుపుచుండెను. నేడు హిందూదేశము నెదు ర్కొనిన తీవ్రజాతీయ సమస్యలయం దాతనికెట్టిజుగుప్సయు లేకుండెను. రాజకీయవాతావరణ మాతని యమాయకమగు రాజభక్తి పూరితమగు హృదయమున నెట్టివికారమును గల్గిం పజాలకుండెను. జనకుని వాక్యము లాతనిహృదయమున గాఢముగా నాటుకొనెను. ఇతడు ఎంతటిరాజభక్తుడు? పంజాబునందు మానవ స్వతంత్రిమునకై పంజాబు దేశీ యులు పాల్గొనలేనప్పుడు దేశస్వతంత్రమునకై ఆందోళన

చేయుచున్న ప్రజలతోగాని ఉద్యమములతోగాని యీ యన యేకీభవింప లేదనిన నాతని రాజభక్తి యెంతటి అస్ఖలితము అమాయకము, అని మనము తెలిసికొనవలెను. రామానుజ వర్మ, గణపతివర్మ, అని ప్రతాపవర్మకు 2 పుత్రులు 1 పుత్రిక. రామానుజవర్మకు 20 సంవత్సరముల వయస్సు ? జాంసీలో యుత్తమపాఠశాలలో విద్యాభ్యాస మొనరించుచుండెను. విద్య యీతనియందు ఖడ్గచాలనకౌశలము ప్రకాశించునట్లుగా రాణించలేదు. తండ్రిగారికికూడా యిద్దరుకుమారులను పటాలములలో జేర్పించవలెనని కోరికయున్నది. తన యొక్క కుమాళ్ళు గొప్ప నాయకులు కాగలరని ఆయన యూహ! ఈసమయముననే ఐరోపామహాసంగ్రామమునకు భారతదేశమునుండి ప్రత్యేకముగా పటాలములను స్వీకరించి గవర్నమెంటువారు జర్మనీకి పంపుచుండిరి. సనాతనమునుండియు క్షాత్రారాధనము నొనర్చుచు వచ్చుచుండుటచే క్షత్రియకులము శూరజాతి అయినది. ఆకారణమున క్షత్రియులు విశేషముగబోయి పటాలముల నింపుచుండిరి. వీరితో సమానముగా సింగులుకూడా యుద్ధముచేయుటకు పటాలములలో చేరియున్నారు. ప్రతాపవర్మకూడా రామానుజవర్మను పటాలములలో జేర్చెను. రామానుజవర్మ చదువుకొనుటకే పంజాబువెళ్ళెను. ఒకనాటిసమయమున రామానుజవర్మ అమృతసరమునందలి తనస్నేహితులను గొందరిని చూడనేగుసరికి

4గంటలు కావచ్చినది. త్రోవలో అనేక ప్రజలు గుంపులుగుంపులుగ యెచటికిపోవుచున్నారో అతనికి యెదురైరి. ఆప్రజలు మైదానమున జరుగబోవుసభకు పోవుచున్నారని వానికి తెలిసెను. సభాసందర్శనోత్సాహమున రామానుజవర్మ, వేగముగయింటికి వచ్చి తనభార్యతోచెప్పి సభకు వెళ్ళెను. ఆనాడు [ది 6-4-191] అమృతసరమునందు వైశాఖోత్సవము ! ఆదినమునుహిందువుడైనవాడెవ్వడునుమరువడు! తమశౌర్య గౌరవ సర్వస్వమును బ్రిటీషుసామ్రాజ్య సౌధమున కాధారపాషాణముగ నొసర్చిన శిక్కులను అకాలీలను ధర్మసాధకులగు క్షత్రియులను అణుమాత్రమైన శంకింపలేక శతఘ్నులచే ప్రేల్చిన బ్రిటీషుసోల్జరుల దురంతములు మరుపునకు వచ్చునా? ఆదినము మరుపునకువచ్చుటకు బిడ్డలను గోల్పోయి, తల్లిదండ్రులను బాసి, భర్తలనుబాసి విలపించువారి యార్తనాదముల వినియు తాముచేసిన యపకృత్యమునకై పశ్చాత్తాపపడక, మందుగుండు అయిపోయినది. లేనియెడల నింకను గాల్చియుండనా ? అని చెప్పిన వాక్యములు మరుపునకు వచ్చినగదా ఆదినమును మరచుట! పంజాబుహత్యలకు వన్నెతెచ్చిన జలియన్ వాలాబాగు దారుణవధలు జరిగినది యీరోజే! క్షత్రియబాలుడు సభకు ఆలస్యముగ వెళ్ళినకారణముచేత సభామధ్యకు వెళ్ళజాలక గవర్నమెంటువారి సేనసమీపమునకు వచ్చెను. బ్రిటిషువారు ప్రజలపై ఎక్కడనుండి బాంబులు ప్రే

ల్చినో ఆస్థలమునకు దగ్గిరనేయుండెను. ఆబాంబులు ప్రేల్చి నవెంటనే రాజకుమారుడు వీరస్వర్గమునకు జనెను. ఇట్లుకా ల్చగా కాల్చగా మందుగుండుసామాను అయిపోయెను. తరు వాత గవర్నమెంటు సైనికులు వెడలిరి. ఈదారుణవార్తలు దేశదేశములు పట్టణమంతయు వ్యాపించెను. ఎక్కడచూచి నను శోకవార్తలు వినబడజొచ్చెను. ఏమేడలుజూచిన రోద నములతో నిండిపోయెను.

ఆసాయంత్రము గృహములు వీడివెళ్లినవారు తిరిగిరారని తెలుసుకొనియున్నారు. అధికారి దీనితో సంతృప్తిజెందక సైనికశాసనమును దానినిసహాజసంపూర్ణవాక్కులతో అమలులోనికి తీసుకొనివచ్చిరి! వీథులలో యెవ్వరును తిరుగగూడదు. తుదకు జలియన్‌వాలాబాగులో చచ్చినవారికి నీళ్ళుసహితము యివ్వకూడదు. వీథులన్నియు నిర్మానుష్యము లయ్యెను. ఎవరైనా తమవారిని వెదకుటకు వీథులలోనికిపోయి కొన్ని అడుగులైనను నడువకపూర్వమే శాంతిని స్థాపించుటకు ఆం దోళనపడుచున్నమిలటరీవారికంటబడి వారి ఆయుధములతో లేక మేజాజోళ్ళతో తన్నులకు గురికావలసివచ్చెను.

ఉ. ఉత్తరమేగరాదు గలయూహల స్వేచ్ఛగదెల్పరాదు స్వా
యత్తముగాదు సేయగ బ్రియాణము దేశముదాటి పత్రిక
చ్ఛాత్రగరాదు దేశముననున్నదియున్నటు రాజలోటునో
రెత్తివచింపరాదు దొరలేమన నడ్డిమొదట్టమీశ్వరా.

ఉ. ఎంతటికష్టమైననుసహింతురుకూరిమిగల్గుకాంతలుఁ
గాంతలుగూడికష్టములుగాపురముందునెయంచు జిత్తవి
శ్రాంతియొనర్చుకొంచును బరస్పరభావిసుఖాభిలాష దుః
ఖాంతమునఁ సుఖంబుగను నాసలు నైజముగావె జీవికిఁ.

భయోత్పాతములగు దీనులవికటార్తనాదముతో నిండి నిబిడీకృతమైన ఆ నిశీథసమయమున నొంటరిగ, నిర్మానుష్యములగు నావీధులనుండి ఆచీకటిలో నిర్భీతమై జంకక, సైనికశాసనములను సహితము లెక్కచేయక సైనికులు ఆజ్ఞలను ఉల్లంఘించి ప్రాణహానికి వెరువక తదేకదీక్షతో భగవంతుని నమ్మి రామానుజవర్మభార్య తనపెనిమిటి యెడబాటును సహించలేక అతనివృత్తాంతము తెలియక జలియన్ వాలాబాగునకు వంటరిగా వెళ్లుచుండెను. భర్తయేదైవమనినమ్మి పతికంటె యితరములేదని, పతిలేనిబ్రతుకు వ్యర్థమని నమ్మి, పతిసేవయే పరమపావనమని నమ్మి, పరమపతివ్రతా శిరోమణియగు రామానుజవర్మభార్య తదేకదీక్షతో తనభర్త జీవించియున్నదీ లేనిదీ తెలుసుకొనుటకు ఆతురతతో వెళ్లుచుండ నెవ్వరు అడ్డుపడగలరు? పతివ్రతను యేశాసనమాపగలదు? ఈభారతదేశమందు బ్రహ్మ, విష్ణు, మహేశ్వర్లు సహితము పతివ్రతకు భయపడి యేమియుచేయలేకపోయిరని చరిత్ర బోధించుచున్నవి! ఇక మనుష్యమాత్రులైన సైనికులుగా శాసనములుగాని, యీప్రభుత్వమువారుగాని, ఆపుటకుశక్య

మా ? అంతమాత్రమున పతివ్రతలు తమధర్మమును విడనా
డుదురా ? ఆమహాపతివ్రత వెళ్ళివెళ్లి చిట్టచివరకు జలియన్
వాలాబాగునకు వచ్చెను. అక్కడ పడియున్నప్రజలు లెక్క
లేకుండా పడియున్నారు. చచ్చినవారు కొందరు, చావని
వారు కొందరు. వారిపైబడిన శవముల వత్తిడికాగలేకయు,
లేవలేకయున్న వారిసంఖ్యకు హద్దులేదు. దెబ్బలుతగిలి రుధి
రముకారుటచేత దాహమునకు ఆగలేక, మాట్లాడుటకు నో
రాడక, లేచుటకు శక్తిలేక యెందరో అచ్చట పడియుండిరి.
ఆప్రదేశమంతయు శవములనదీప్రవాహములవలె కన్పడు
చుండెను. చీకటి తీవ్రముగా నుండెను. అటువంటి అవస్థలో
ఆపతివ్రతకు తనభర్త కనుపించలేదు. వెదకివెదకి నిరాశ
చెందెను. తనభర్తను చూచుభాగ్యము లేదని విచారించెను.
ఈసమయమున నొకదొరమోటారుబండి ఆవైపునకువచ్చె
ను. ఆమోటారుయొక్క కాంతిచేత తనభర్తయొక్క శరీర
ము తనకాళ్ళవద్ద పడియుండుటచూచి త్వరగా పొంగిపొంగి
పొరలివచ్చుచున్న దుఃఖమును ఆపుకొని భర్తపై పడియున్న
శవములనుదీసివైచి నెమ్మదిగా ఆతనిశిరస్సును తనతొడమీ
జేర్చుకొని, నాథా! ఏమైన ప్రాణమున్నదా అని పరీక్షిం
ను. రామానుజవర్మ తనశరీరముమీదనుండు శవములను
యుటచేత కొంచెమూపిరియాడి, ఆరిపోవు దీపముయొక్క
వెలుగున చూచి తనప్రియకాంతను నీరుతెమ్మని నెమ్మదిగా

అడిగెను. ఆవాక్యములు ఆమెకు వినబడకున్నను గ్రహించి నెమ్మదిగా ఆతనిశిరస్సు భూమిపై బెట్టి నీళ్లకై లేచెను. అచ్చట నీళ్లు యెక్కడను లేకపోయెను. చాలాచోట్ల వెదకుటకు బయలుదేరెను. అక్కడకు శవములను తనిఖీచేయుటకై వచ్చిన మిలటరీఆఫీసరు చూచి, అచ్చట కావలికాయుచున్న సైనికునిజూచి,ఎవరా లేచినది అనెను. సైనికుడు యెరుగననియు, వెళ్లి చూచివచ్చెదననియు, చెప్పెను. ఇప్పటివరకు యేమిచేయుచుంటివి అనెను. నీకు ఆయుధములు ఎందుకు? ఆనుకొని పరుండుటకా? పో, పో. వెళ్లి యెవరైనను సరే బయటికి తరుముము. నీ ఆయుధమును విచ్చలవిడిగా యుపయోగించుము. ఎవరిని ఇక్కడకు రాకుండా జేయుము. జాగ్రత్త అని వెళ్ళెను. ఈమాటలు వినుచున్నపతివ్రత భయకంపితయై భర్తను వదలలేక ఆఫీసరు చూచునేమోఅని భయపడి తిరిగిభర్తవద్ద తలవంచుకుని కూర్చుండెను. దాహబాధచేత రామానుజవర్మ విలపించుచుండ చూచి ఆపతివ్రతాశిరోమణి యోర్వలేక, నీళ్లకై లేచుచుండ ఇంతలోన సైనికుడు వచ్చి తనతుపాకీనున్న కత్తితో నామెకంఠమున బొడిచెను. వెంటనే రక్తముచిమ్మి రామానుజవర్మముఖముమీద ప[illegible]సాగెను. నీళ్లనిభ్రమించి రామానుజవర్మ రక్తమును దా[illegible] ప్రాణములను గోల్పోయెను. తండ్రిగారు భోజనానంతర[illegible] యింటికివచ్చి జరిగిన చరిత్రఅంతయు విని దుఃఖించి మిలటరీశ

షనమును తిరస్కరించి కావలాకాచుచున్న సైన్యముయొక్క భయమువదలి లెక్కగొనక వెంటనే జలియర్ వాలాబాగు నకు చేరెను. కాని రెండుకాళ్లు లేకపోవుటచే వెంటనేఫోజా లక నెమ్మదిగా చేరెను. సమీపమున కావలివారు పట్టుకొనిరి. తండ్రిచేయునది యేమియు లేక విచారించుచూ హా! తనయా! ఎచ్చటనుంటివిరా?తనయాయని మెలుగెత్తి యేడ్చెను. రక్తము స్రవించుచున్నకోడలు యాకంఠస్వరము విని తన మామగారిది అని తెలుసుకుని రక్తమును ఒకచేత తుడుచుకొనుచు హా! తండ్రీ! మనరామానుజవర్మను చంపినారు. నేను నాథర్తతో సహగమనముచేయదగినదాననగుటచే నేనుకూడా చచ్చుటకు సిద్ధముగనుంటిని. నాప్రాణప్రియునితో బాటు నాకుకూడా చచ్చుభాగ్యము లభించినదని చెప్పుచు భర్తకునమస్కరించి ఆతనివక్షస్థలముపై బడి ప్రాణములను విడచెను. తండ్రి యీవాక్యములను వినినతోడనే విచారముఆపుకొనలేక యేడ్చుచు తనకుమారుని ఒకసారిచూచి వీలుగావున్న తనకోడలిని బ్రతికించ బ్రయత్నించెదనని అనేకవిధములు కాళ్లవేళ్లబడి బ్రతిమాలుకొనెను.అనేకకారణములు జెప్పినను దయాదాక్షిణ్యము మెరుగని సైనికులు వద్దనుటచే నదినిష్ప్ర యోజనము ఆయెను. ప్రతాపవర్మ తనకుమారుని అకాలమ రణమునకును, కోడలిత్యాగమునకును, గవర్నమెంటు ఉద్యోగస్థుల దుండగములకును జనించిన దుఃఖముచేత నిర్జీవుడై

యుండెను. క్షత్రియసోదరులారా ! యీసుకుమారశరీరులగు కుమార్డు అతనిభార్య మరణములు వృధాకాజాలవు? భారతదేశమందు పతివ్రతల కెందును అపజయములేదని మరియొకపర్యాయము విశదమాయెను. గవర్నమెంటువారి శాసనములుగాని, తుపాకుల బెదరింపులుగాని, పతివ్రతల నాపజాలవని రూఢిఆయెను. ఇందులకు రామానుజవర్మభార్యయే నిదర్శనము! మనప్రభుత్వమువారు ఆమెపట్ల జేసిన దుండగములను పురుషులుగాని, స్త్రీలుగాని, పంజాబుదేశీయులగు శిక్కు క్షత్రియ అకాలీ సోదరులుగాని, వారివారి హృదయములనుండి మరువజాలరు. ఈపతివ్రతాశిరోమణియొక్క త్యాగము మనజీవితమందు గ్రహించవలెను. పాఠకమహాశయులారా ! ప్రతాపవర్మయొక్క చరిత్రముగ్రహించి దేశస్వతంత్రముకొరకు పాటుబడి సంఘాభివృద్ధికి తోడ్పడుడు! ఇట్టి వీరులచరిత్రములు, సాధ్వీమణుల సుగుణసంపత్తి, మనకాదర్శనీయముగుగాక !

సంక్రాంతి బహుమతి.

(గా. సో)

సంక్రాంతి పండుగదినము లేతెంచినవి. పట్టణముల పల్లెలు నూతనవికాసముతో గలకలలాడుచున్నవి. అతిమ హరమైన సిరిపురము నాడు మరింత మనోజ్ఞముగా, ముగ్గుల

మిలమిలలతో వెల్లల తళతళలతో విరాజిల్లుచున్నది. సిరిపుర మంత పెద్దగ్రామము కాదు. ఆచెరువుచుట్టును గల యేబది యిరువది గృహములే యాయూరు. ఆపల్లెకంతకు నాచెరువుగట్టున నున్న దొక్కటియే పెంకుటిల్లు. అది యాయూరికి పెద్దరైతుది.

ఏడుగంటలైనను గొండచాటున లోయలోనుండుటచే సూర్యుని యరుణకిరణము లీగ్రామముపై బడుట లేదు. కొండకొనలపై రవికాంతులు తాండవించుచున్నవి. కొండపై కనకవర్షము గురియుచున్నట్లున్నది. ఆకాశము నిర్మలమై నీలపునిగ్గుల నింపుచున్నది. కొలను జలపూర్ణమై గంభీరముగానున్నది. చెరువుగట్టు మొదలు కొండకొనలసమీపమువఱకు పచ్చరంగుగలిగి యాప్రదేశమంతయు దరులతాగుల్మములతో మిక్కిలి మనోహరముగా నున్నది. ప్రభాతమధురవాయువులు మందగమనమున గలయదిరుగుచున్నవి. అంతకిరుమని యాపెంకుటింటి బహిర్ద్వారపు దలుపు గ్రింధులపై గిర్రునదిరిగి యాప్రకృతి మనోహరతకు మెరుగనదగు నొకపరువపుబడితి ద్వారము దాటి యావలకు వచ్చినది.

ఆమెయే పెద్దరైతు కుమారిత సుభద్ర. ఈమెతప్ప నేరెవరును బెద్దరైతునకు లేరు. అందుచే జాలగారాబముతో నీమెను బెంచుచుండును. ధనవంతుడౌటచేతను, దగ్గఱనేయున్న కాళికాపట్టణమునకు దఱచుబోవు వాడౌటచేతను,

సుభద్రకు మెత్తని దుస్తులగొని యిచ్చెను. ఆమె నేడు పసుపుపచ్చనిచీర గట్టియున్నది. మృదులమై మిసమిసలాడు ముదరమెరుపు పట్టురవిక నొయ్యారముగా ధరించియున్నది. స్నానముజేసి యారిన శిరోజములదువ్వి లీలగ జడగానమర్చికొన్నది. బంగారువంటి శరీరచ్ఛాయ! పదునారు సంవత్సరముల దోరపుబ్రాయము! విశాలనేత్రములు, తీర్చిన గుల్లబుపూవువంటి నాసిక, నవరోజావంటి యధరము, మల్లులవంటి దంతములు, మొల్లలరాసులవంటి చూపులుగల యామె మనోహరరూపము, మిక్కిలి యొప్పియున్నది. ఈమెకింకను వివాహముకాలేదు. ఎవరును నచ్చకుండుటయే దీనికి కారణము. బీదవానినైన నందగానినే వివాహము జేయవలెనని తండ్రియొక్క తలంపు కూడను. ఆగ్రామములో నీమెయొక్క కరుణాపరిసారముల కాశించి, ప్రార్థించి, తుదకు హతాశులై కృశించు యువకులు చాలమందికలరు. కాని యీామె హృదయము నాకర్షించుటకు తగినవాడు పశుపతి యొకడుండెను. వానిగూడ సుభద్ర, గర్వముచే దిరస్కరించి యవమానించెను.

నేటి యుదయమున సుభద్ర పండగయలంకారము జేసికొని మైలులోపుననున్న ధర్మవరగ్రామములోని మేనత్తకు పంక్రాంతిబహుమతిగా గొన్ని పిండివంటల నొక బుట్టలో

బెట్టుకొని, తండ్రియెంత చెప్పినను వినక యాగ్రామమునకు బోవ బయలుదేరెను.

ధర్మవరమునకును సిరిపురమునకును రోడ్డుకలదు. రోడ్డుదారి కొంచెము చుట్టు. అప్పటికే యెనిమిది గంటలయినది. సుభద్ర మేనత్తగారియూరు ద్వరగ జేరవలెనని వడివడి నడచుచున్నది. సుభద్ర మేనత్తను మేనత్తగారి గృహమును, మేనత్త యెదురుగవచ్చి, తన్నుగౌరవించి కౌగిలించు నట్లును మొదలగునవి మనమున జిత్రించుకొనుచు నచ్చట నుండిన యట్లుగనే, తలంచి, సంతోషించుచు, నడచుసరికి మిక్కిలి యాలస్యమాయెను.

తొమ్మిదిగంటలయినది. అప్పటికి సుభద్ర సగము దూరము వచ్చినది. అక్కడ యొక కాలువగట్టుగలదు. ఈ గట్టుబట్టి పోయిన ధర్మవరము ద్వరలో జేరవచ్చును. కాని పొలముల గట్లుదాటి పోవలసి యుండును. అటులజనుటకే నిశ్చయించి, గట్టుపై బొదుగుగ బెరిగిన గడ్డిలోనుంచి చరచర నడుచుచున్నది.

కొంతతడవునకు బసుపతితోట సమీపించినది. ఈ తోటచుట్టును సుమారొక మొలయెత్తు రాతిగోడయున్నది. ఈగోడదాటిపోయినచో నాకనబడునదే యాగ్రామము. బాలయగు సుభద్ర, గోడకొమ్ములవరకు వచ్చినది. అటునిటు జూచుసరికి ప్రక్కనే యెన్నటియధికవర్షములకు గొంతపడి

పోయిన యొక మొండిగోడ కానబడెను. దానిని దాటుట సుభద్రకు మిక్కిలి సులువు. కావున శీఘ్రముగా మొండి గోడ తావునకుబోయి, ఫలహారములబుట్టను గోడపైనుంచి మెల్లగ మొండిగోడ నవరోధించి ఛంగునదాటి యవలకు దిగెను. పాపము సుభద్రి వెనువెంటనే మొండిగోడకూడ తడిసి యారియుండుటచే, గుభీలున గూలిపోయెను. కాని యపాయము సుభద్రికు గలుగలేదు. లేచి, చిరునగవుతో వెనుకకుదిరిగి, చూచి, పశుపతికి దగిన శాస్తి జరిగినది. పండుగరోజున చేతినిండపని కలిగినది లే! యని ప్రకాశముగా బలికి, తనబట్టను దీసికొని తోటలోనుండి చరచర బోవు చుండెను.

అదియొక మనోహరమైనతోట, సకల ఫలవృక్షముల తోడను పక్కనేయున్న చెఱకుతోటలతోడను, మిక్కిలి రమ్యముగానున్నది. మిక్కిలి దట్టముగ నల్లుకొనిన యాకులచే సూర్యరశ్మి యాతోటలోనికి జొరచుటయే లేదు. అందున తోటవారుండుటకు రాతిగోడల పూరిల్లొకటి యుండెను.

అంత వెనుకనుండి ఎవరది ? ఆగుము. అను పిడుగువంటి కేక సుభద్రను బలవంతముగా నాపివైచినది. భయకంపితయై వెనుకకు దిరిగి చూచుసరికి, పశుపతి యామెనుసమీపించి చిరునగవుతో నిలబడెను.

పశుపతి మిగుల సందగాడు. ఇరువదిరెండు సంవత్సరముల తరుణవయస్సు, మిలమిలలాడు శరీరకాంతి, నవనవలాడెడు శరీరావయవముల బలిష్ఠత, కలకలలాడు మోము, అవి మగవారలనె మోహింపజేయుగలవు !

సుభద్రను సమీపించి చిరునగవుతో ఏమియునెరుగని దానివలె బోవుచుంటివే. ఓహో ! మంచిదానవే ! గోడనుబేర్చి మరియు బొమ్ము. అని చివరమాట గొంత కఠినముగా, మోమున నిశ్చయము తాండవింప బలికెను. సుభద్ర యామాటల లెక్కగొనక పోవయత్నించెను. పశుపతి దారికడ్డుగావచ్చి నేను జెప్పినమాటలు నీకర్థముగా లేదా ? యని రోషముతో బలికెను.

సుభద్రకు గోపమువచ్చెను.

నాకవసరమైన పనియున్నది. నేబోవలెను, నన్నాటంకపరుపకుము. అని ముఖము చిట్లించుచు బలికెను.

ఎంతయవసరమైన పనియున్నను సరే యిదిచేసి మరియుబొమ్ము.

ఏమి యింతమంకుతనము ?

ఔను ! మాకు దీనిలోనైన యుండవలదా ?

అటులైన నన్నుబోనీయువా ?

ఆహా ! నిన్నుబోనీయుదు, అని నవ్వుచు పశుపతి బిగ్గరగా బ్రితియక్షరమునొక్కుచు నుచ్చరించెను.

సుభద్రి రోషముతో బుట్టను నేలమీదనుంచి, చరచర గోడదగ్గరకు బోయి రాళ్ళను బ్రోగుచేయ మొదలిడెను. పశుపతి నవ్వుచు నిలబడి చూచుచుండెను

సుభద్రి చాలసుకుమారి. పని జేసి యెరుగదు. నిమ్మకాయలంతటి చిన్నరాళ్ళనెత్తి ప్రోగువేయుచున్నది. పదిరాళ్ళనెత్తునరికి పావుగంటయగుచున్నది. మోముదమ్మి చిరుచెమటచే దడిసినది. సుభద్రి మిక్కిలియలసిపోయినది. పశుపతికి చూడజాలివైచినది. ఇటుల జేసిన నెప్పటికి బనిపూర్తియగును? అని నవ్వుచు నాతడనెను. సుభద్రి మారుబలుకలేదు. కాని కొంతచురుకుగా రాళ్ళనెత్తుచుండెను. ఇంక బ్రయోజనము లేదనుకొని పశుపతికూడ బనిచేయుటకు మొదలిడెను.

సుభద్రి యిప్పుడు పశుపతిని బాగుగ పరిశీలనాదృక్కులతో విలోకించి మిక్కిలి యందగాడే? యని మనస్సులో ననుకొనెను. కాని యాతనిపై రోషమింకను బోలేదు.

ఒంటిగంట కావచ్చినది! పనియింకను జాలగలదు! పశుపతి చేతుల గడుగుకొని యన్నమును దీసికొనివచ్చి సుభద్రిను దినుమని బలవంతముజేసెను. ఆమె తినలేదు. పనిని విడువను లేదు.

పశుపతి నిముసములో భోజనమును జేసి తిరుగపనిని ప్రారంభించెను. సుభద్రి చిన్నచిన్న రాళ్ళనేరి యాతని కం

డించుచుండెను. తుదకు పనిపూర్తియగునరికి సూర్యుడు పశ్చిమభూధరమునకు జేరెను. సుభద్రకు జేతులుకందినవి! మోముదమ్మి యెఱ్ఱబారినది. కండ్లునశ్రుధారాపూరితములయినవి. తనఫలహారములబుట్టను దీసికొని యాయాసముతో నొకమాటైన బలుకక, సుభద్రి తోటగుమ్మము దిక్కైబోవుచుండెను. పశుపతికి మిక్కిలి విచారముగలిగెను. తనకాఠిన్యమునకు దానే యాశ్చర్యపడెను! చరచర నేగి యామెను సమీపించి సుభద్రా? యని పలుకరించెను. ఆమెయాగి ఏమి? యనెను.

సుభద్రి యాతని మోముపై దనదృక్కుల బరపెను. పశుపతికండ్లలో నశ్రుధారలజూచి యామెకరగిపోయెను!

పశుపతి పూలసరములబోలు నామెదండల గ్రహించి క్షమింపుము. అని దీనముగా బలికెను. సుభద్రకు దుఃఖము వచ్చెను. అతనివక్షముపై మోముదమ్మిడి యశ్రుధారలచే దడిపెను! ఆతడు గాఢముగ కౌగిలించుకొనెను. ఆమె మారుమాటాడలేదు. ఈయుగళమును సూర్యభగవానుడు చూచి పకపక నవ్వెను. ఒక మైనదంపతులు, దగ్గరనున్న చెట్టుకొమ్మమీదనుండి తమసహజమాధురీగానముల మంగళహారతుల బాడినవి! సమీపముననున్న పూలచెట్టీదంపతులపై బుష్పవృష్టి గురిపించెను. ప్రక్కనున్న పంటకాలువ స్వస్తి వాక్యముల గొణిగివైచెను.

సుభద్ర భయముజెందిన దానివలె దొట్రుపాటుతో నన్నుబోనిమ్ము. నేను బోవలెను. అని యాతని వేడుకొనెను.

ఎక్కడకు బోయెదవు—ఒంటరిగ;

మా మేనత్తగారి యింటికి.

ఎందులకు!

సంక్రాంతి బహుమతి నిచ్చుటకు.

నాకో బహుమతీ! యని చిరునగవుతో గాఢముగ మరల నామెను కౌగిలించుకొని యామెమోముదమ్మిపై ముద్దులవర్షించెను! యౌవనుల కింతకంటె కావలసిన సంక్రాంతి బహుమతీయేమున్నది? ఇదియే మన పూర్వుల గాంధర్వ వివాహపద్ధతి!

శాంతాదేవి.

(మ. సో.)

ఎందుకొచ్చిందండీ యీబ్రదుకు? ఎందులోఅయినా దిగిచస్తే బాగుండేటట్టు కనబడుతోందండి. ఎంతకాలమని వోపికపట్టనండీ?

అని పదిహేనేళ్ళ యీడుగల ఒకపిల్ల చామనచాయది తనతో కూడా కాలవకువచ్చే అవ్వగారితో అంది. ఆపిల్లవొంటిమీద అప్పుడే విప్పారుతూవున్న యౌవనశోభ కనిపించకపోదు. తళుక్కుమని మెరిసే సోగకళ్ళు, ఆకో

భలో ఆపిల్లముఖానికి అందాలు దిద్దతున్నా, ఎప్పుడూ వేదనపడే మనసు ముద్రించే ముద్రలు ఆపిల్లనుదుటిమీద స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నవి. మొగ్గతొడుగుతూ వున్న తీగకు చీడపేను పట్టినట్టుంది ఆపిల్లవైఖరి !

అమ్మా ! వోపికపట్టాలి, సహించుకోవాలి తల్లీ ! వాగాయత్వపుమాటలెందు కంటావమ్మా ? మీఅమ్మేవుంటే యింతెందు కొస్తుంది ? ఇంతకూ నీఖర్మం యిల్లావుంది !

అని పిల్లమాటలకు అవ్వ బదులుచెప్పింది. అవ్వకు యేభైయేళ్ళు పైదాటినవి. అవ్వ కళ్ళముందరనుంచి చాలా కాలం గడచిపోయింది. ఇల్లాంటి సందర్భాలలో అటువంటి పిల్లలిని ఎల్లావోదార్చాలో అవ్వకుబాగా తెలుసును. అందుచేత అవ్వ ఏరసానికానొక్కు నొక్కుతూ మాటాడుతుంది.

రసస్ఫూర్తిఅయిన అవ్వమాటలకు తేరుకొని ఆపిల్ల లోపలవుండే ఆవేదనంతా ఆవిడతో వెళ్ళబోసుకొంది. అప్పుడు వారిద్దరికీ ఈసంభాషణ జరిగింది.

అంతే అల్లాగే అనుకోవాలి! ఎందుకు పిన్నిగారూ ? చెపుతేనమ్ముతారో లేదో గాని నింజగా రాసి రంపాన్నిపెడుతోందికద ! ఒకమాటుకాదు రెండుమాట్లు కాదు. విసుకూ విరామం లేకుండా ఎప్పుడూ ఏదోవొకటి తిడుతూనో, సాధిస్తూనో వుంటుందికద !

అవునమ్మా ! ఎవరెరుగనివి యీసంగతులు ? నిన్నటివా మొన్నటివా ! పోనీ అతండి్రముండాకొడుకైనా నీవు

కాపరానికి వెళ్ళిందాకా బ్రతికి వుండకూడదు ? ఏమిటో ఇంతకూ అనుభవం ఇల్లావుంటే మరొకలాగెల్లా జరుగుతుందమ్మా

పోనీ, పిన్నిగారూ ! నాకు తెలియకపోతే చెప్పాలి. చెప్పి చేయించుకోవాలి. తాను చెప్పనూ చెప్పక నేనుచేసిన మీాదట సాదిస్తే ఎల్లావుంటుందండీ ! ఎప్పుడూ ఏపిల్లిమీాదో, యేయెలుకమీాదో పెట్టి అయినవీ కానివీ అంటూనే వుంటుంది కదా ! అబ్బబ్బ ! ప్రాణం విసిగిపోతోందండి. తిన్నతిండి నీరై పోతోంది. అక్కడికీ వూరికేకూర్చోక నాచేతనైనపని నేను చేస్తూనేవుంటాను. అయితే సరా ? మంచిచెడ్డలు మనసును బట్టి వుంటాయికాని పనినిబట్టి వుండవు. ఎంతపని చేసినాసరే మనమీాద యిష్టంలేని వాళ్ళను మెప్పించలేం !

ఏమేనమామకొడుకైనా నిన్నొకమాటు తీసుకువెళ్ళకూడదు ? నీమేనత్త ఏంజేస్తోందే.

ఏమిటో, ఎక్కడిమేనత్తలు ? ఎక్కడిబంధుత్వాలు ? అక్కడికి మానారాయణ నాలుగుదినాలైంది ఉత్తరం వ్రాశాడు. వాడు ఎల్లుండి విదియా బుధవారంనాడు రావాలి. అయితే వాడువచ్చి నన్ను తీసుకువెడతానంటే మాత్రం మీారు పంపిస్తారనుకొన్నారా యేమిటి? అది వట్టిమాట. ఇక్కడ పనిపాటలు నేనువెడితే ఎవరుచేస్తారు. ఇక్కడ పనీచేస్తూ వుండాలి. సాధింపులూ పడుతూండాలి! ఇంతకూవస్తానని వుత్తరం

వాశ్రీశాడుకాని వస్తాడో రాడో. వాడికిమాత్రము పనులు లేవు? ఏమనుకొంటేయేం ప్రయోజనం? ఇంతకూ నాఖర్మ మిల్లావుంది."

అంతేనమ్మా! వోర్చుకోవాలి. ఎంతవోర్చుకొంటే నీకంత మంచిది అంటారు! లోకంలో ఎల్లాంటి వాళ్ళు కూడా వుంటారు. అమ్మా! నీఖర్మం ఇల్లావుండబట్టేనా, నా అన్న దిక్కు లేకపోయింది!

చెప్పుకొన్నకొద్దీ కడుపు తరుక్కుపోతుంది. పిన్నిగారూ! మొన్న మాచిట్టెమ్మ పుట్టినరోజని పండుగ చేసుకొన్నాము. ఆరోజయినా సంతోషంగా మాటాడుతుందేమో అన్నాను. అల్లాంటిది అన్నీ అల్లా సంభవిస్తాయికాబోలు! కాలవకువెళ్ళి నీళ్ళుతెచ్చి పిండీ గిండీ యిచ్చి పైపని అంతా నేనే చేశాను. అయినా పిల్లను తీయలేదని తల్లీ! చెపుతే నమ్ముతారో లేదో కాని ఆనాడు వేసినకేకలు కేకలుకావు; సాధింపులు సాధింపులు కావు? ఏంచెప్పను. అబ్బబ్బ! ఒక మాదిరీ ఒకవిధమూ కాదండీ.

అవును. ఆవిడసంగతి యెవ్వరెరుగనిది? నీకేంతెలుసు ఆవిడచిత్రచర్య! నిన్నలేక మొన్నపుట్టినదానవు. అయితే యేంలే ఎప్పటికైనా చేసినవాళ్లు చెడ్డవాళ్లుకారు. ఆవిడక్షైం తెనిసిందికాని నీవేమీచెడిపోవు, రేపుచైత్రమాసంలోనో వైశాఖమాసంలోనో కార్యమవుతుంది. అప్పుడు కలకా

లమూ ఇక్కడే అట్టే వుంటావా యేమిటి? నీఅత్తారింటికి నీవు వెడుతావు! నీమగడూ నీవూ హాయిగా ఉంటారు. ఇంకె న్నాళ్లు? మంచిచెడ్డలుంటాయిగాని తనువులుండవు!

పింతల్లి అవునాండి అత్తగారినికూడా మించిపోయింది.

అమ్మాయీ! అత్తగారూ కోడరికము అన్నమాట గాని వెర్రిదానవుకాకపోతే అత్తగారూరికే తిట్టికొట్టి చంపు తుందటే?

అని మాట్లాడుతూ వారిద్దరూ కాలవకువచ్చారు. అ ప్పటికే కూలివాళ్ళు పనులకెళ్ళేవేళైంది. కాలవనీరాటరేవు చాలాసందడిగావుంది. వచ్చేవారు వస్తున్నారు. నీళ్లుముంచు కొని వెళ్ళేవాళ్లు వెళుతున్నారు. ఏమమ్మోయి! నీవు కేకే స్తావంటే ఇందాకా ఇంటిదగ్గరే వున్నాను. వచ్చేటప్పుడు పిలవకూడదటమ్మా? అని ఒకతె తనయింటి పొరుగావిడపై నేరముమోపుతోంది. మాపాలేరు లేడు. అందుచేత చిట్టు కలిపి గుగ్గిళ్లువేసి వస్తానని అంటూంటేనే వచ్చావు. ముందు గావచ్చి నీవు చేసిందేమిటో అని వేరొకతె తనస్నేహితురా లిని నిందిస్తోంది. సీతమ్మా! అజిగినీ ఎన్నికాసులదే. అని మ రొకతె క్రొత్తనగలు పెట్టుకొన్న కొత్తవారి ఆడబడుచు న గింది. మీాద నీళ్ళుపడుతున్నాయి, కొంచెం దూరంగా పో డి. అని స్నానంచేస్తూ కళ్లు మూసుకొని అర్ఘ్యమివ్వడాని సిద్ధంగావున్న బ్రాహ్మడు తోమడానికి తోలుకొనివచ్చిన గే

చెలను నీళ్ళలోదిగేసి, యీతాలాడే అల్లరిపిల్లకాయలుజల్లు నీళ్లు మీాదపడగా కళ్ళు తెరిచి కసరికొట్టినాడు. ఇంతలో నీ లమ్మ దగ్గర బట్టలుతుకుతూవున్న రమణమ్మతో కొంచెం ర హాస్యంగా ఏమేరమణమ్మా! కంచివారికామికి కడుపు యేమి టే అని అడిగింది. అంతలో ఆమాట విని, స్నానం చేసినత రువాత మడినీళ్ళుతీసుకువెళ్లడానికి వొడ్డునవున్న బిందెలు తె చ్చుకోవడానికి వెళ్లే అమ్మలక్కలు నలుగురు నీలమ్మదగ్గర జేరి యేవో గుసగుస లాడుకొని నవ్వుకొన్నారు. ఊరుకో ఎప్పుడూ నీవిల్లాంటి మాటలేచెపుతావు. అని రమణమ్మనం టూ వొక్కతెనవ్వుతూ తిప్పుకొంటూ పోయింది. అప్పటికి బట్టలుతికి బిందెనంటించి తెచ్చిన చింతపండుతో అవ్వ బిందె తోముతోంది. అప్పుడు సూర్యుడివైపు తిరిగి ముఖానికి పసు పురాసుకొని నీళ్ళుపోసుకుంటూ వున్నరమణమ్మ, అవ్వ కెదు రుగా స్నానంచేస్తూవున్న శాంతమ్మతో అంది.

ఏమే, శాంతా! మీామేనమామ వస్తాడట, ఎప్పుడు వస్తాడే అని.

ఎవరు చెప్పారు? మాపిన్నేనా!

అవును. చెప్పగూడదా యేమిటి.

చెప్పగూడ దన్నానా? ఎవరుచెప్పారన్నాను కాని, తలో సూరమ్మ సంభాషణ కొనసాగించుకొని-

శాంతా! ఈమధ్య లక్ష్మీనారాయణ వస్తాడటే?

అవును. రావాలి. వస్తానని ఉత్తరం వ్రాశాడు! వచ్చి ఒకమాటు తీసుకువెడతాడు! వచ్చేది సంక్రాంతికదా?

సూరమ్మ—అయ్యో! ఈమధ్య అట్లపాడు వెడతావా? ఇంకా నీవిక్కడుంటావేమో సరదాగా మనమంతా బొమ్మలనోము పడదామనుకొన్నాను. నీవు మీవాళ్ళింటికి వెడతావటే!

ఇంతలో కాలవకు నీళ్ళకువచ్చిన చంద్రమ్మ తీసుకు వచ్చిన బిందె బోర్లించి దానిమీద కూర్చుంది.

ఏమిటి, శాంత అట్లపాడు వెడుతుందా? ఏమే శాంతా! ఎప్పుడు వెడతావే అంది.

శాంత—సరే! ఇంకా నారాయణ రానూ లేదు ఏమీ లేదు. అప్పుడే నే నట్లపాడు వెళ్ళాను. ఏమిటో. ఎక్కడి మాటలు!

రమ—సరే! వెళ్లనే వెళ్లవా? ఆతడు రానేరాడా?

సూర—పోనిద్దూ, కొన్నాళ్లయినా సుఖపడుతుంది. ఈసాధింపులు లేకుండాను.

చంద్ర—బొమ్మలనోము కుంటావేమో అనుకొన్నాను! రమణమ్మ పైటచెంగుతో బిందెలోకినీళ్ళు వొడపో[illegible] మీయింట్లో చిన్న ఉంగరం పోయిందన్నారు! దొరికింద[illegible] అవ్వ స్నానం చేస్తూ తనధోరణిలో-

ఆ! మరే, పోయినవస్తువు దొరకడం యెక్కడైనా వుందా మాఅమ్మా! ఎప్పుడైతే చేయిజారిపోయిందో అప్పుడే పోయింది. దొరకడం కూడానా? అంది.

చంద్ర—అదేమిటో; మీయింట్లో వస్తువులల్లా పోతూంటాయి! ఆనడుమ మీచిట్టమ్మ చేతి వత్తులూ, పులిగోరూ, ముక్కుపుడకా పోయినా యనుకొన్నారు కాదూ!

శాంత—అవును.

సూర—ఎవరొస్తారే మీయింటికి దొంగలు.

అవ్వ—ఆమాయ భగవంతుడికే తెలియాలి.

రమ—ఎవరొస్తారు, ఎవరో యింటిలోనివాళ్ళే తీస్తారు. ఇంటిదొంగను పట్టుకోవడం కష్టం.

శాంత—ఏమోనమ్మా! ఎవరెత్తుకుపోతున్నారో వాళ్లదరిద్రం మండిపోను. అంతా మాయగా వుందికాని;

చంద్ర—దొంగా మనుష్యుడే! ఎవరని చెప్పగలం?

వారంతా అల్లా మాట్లాడుతూ వుండగానే శాంతమ్మ స్నానంచేసి నీళ్ళుముంచుకొని వెళ్ళబోతూ అవ్వగారూ! వస్తారా. అని అడిగింది.

నాకోసం ఎందుకాగుతావు నింపాదిగా నడుస్తూవుం . వెనక వస్తాను. అని అవ్వ బదులు చెప్పింది.

ఎడమభుజంమీద బిందెనెత్తుకొని కుడిభుజంమీద బట్టలుసర్దుకొని అప్పుడే కాలవగట్టెక్కిన సూరమ్మ, పదవో

నేను వస్తాను, వెడదాం రా అని శాంతమ్మతో వెళ్ళింది. స్నానంచేస్తూవున్న రమణమ్మ తానుకూడా వస్తాను ఆగవలసిందని వాళ్ళనడిగింది. కాని ఇంకాఆలస్యమైతే పింతల్లి కోప్పడుతుందని శాంతమ్మ ఆగకుండా వెళ్ళిపోయింది. తానాగమంటే ఆగిందికాదని శాంతమ్మమీాద రమణమ్మకు కోపం వచ్చింది ! రొసరొసలాడుతూరమణమ్మ.

ఎల్లాగైతేం మేనత్తయింటికి వెడతానని ఎంతగర్వం వచ్చిందేఅమ్మా? పిన్నంటె యెక్కడలేని భయము. ఈవేళ వచ్చింది కాబోలు ! పోసీ, చక్కపోతే నాపీడైరి ! అని గొణుక్కుంటూ, ఇంకా కోపమాగక దగ్గర నీళ్లుముంచుకొంటూండే చంద్రమ్మతో అంది.

ఎల్లాంటి దనుకొన్నావేమిటి? ఈశాంతమ్మ. పిల్లచూస్తే కొంచెమేగాని తలకుతగని గడుసుపోకలున్నాయి. పైకల్లా మేథకురాలులావుంటుంది కాని అంతా లోపల స్వయంపాకం? అంతవరకెందుకు ? మొన్నపోయిన వుంగరం వెనకపోయిన ముక్కుపుడక, వత్తులూ అన్నీ ఈపిల్లే తీసిందని వీరమ్మచెపుతూ వచ్చింది. ఇక్కడ కాజేసి మేనత్తింటికి వంపుతూంటుందట. లేకపోతే వాళ్ళింటి కెవరొస్తారే ? అందులో వీరమ్మదగ్గరే దొంగతనం సాగడం? ఏమైనాఅంటే త[illegible] తండ్రిలేనిపిల్ల అవడంచేత నల్లాంటుంది గాని లేకపోతేఇల్లా[illegible] టుండా అని లోకులంటారని వెరచి అనడానికి నోరురాక

వూరుకొంటుంది కాని లేకపోతే వూరుకొంటుందా వీరమ్మ అని ?

అవ్వ—గంగేచయమునేచైవ... అని స్నానంచేయబోతూ చాలులే. దాన్నంటే పాపంకూడా వస్తుంది. ఊరుకో, అని శాంతమ్మపక్షాన్ని బదులు చెప్పింది.

చంద్ర—వీరమ్మకిట్టక చెప్పినమాటలు కాని మరొకటికావు? లేకపోతే శాంతమ్మని చూస్తే వీరమ్మ కెపుడుకిట్టింది? ఎప్పుడూ మెడతెరపిలేకుండా దాన్నేదో వొకటి అంటూనేవుంటుంది. పాపం అక్కడకీ పైపనంతా ఉస్సుమనక అస్సుమనక అదే చేస్తూంటుంది?

అవ్వ—ఇప్పటినుంచే కాదు, తల్లీతండ్రీ పోయినప్పటినుంచీ యిదేమచ్చు. ఆపింతండ్రైనా పెళ్ళాన్ని కనరదు. పెళ్ళాంతోపాటు తానుకూడా రెండుకేకలు వేయకపోతే ఆవిడకేం కోపం వస్తుందో అని ఆయన కూడా దాన్నే అంటాడు.

ఇవన్నీ వింటూనే వుందిరవణమ్మ! గబగుబిలాడుతూ పొంగుతోంది మనస్సులో కోపం ఆవిడకు! ముఖం మెరుపెక్కుతోంది, చేష్టల్లో చురుకు పుట్టింది, కోపంపొంగి ఆవిరి వస్తోంది; ఇంతలో మళ్ళీ చంద్రమ్మ అంది అవ్వతో,

నేను చెపుతాను వినండి అవ్వగారూ! తల్లిదండ్రిలు పోయిన తరువాత నెవరో యితరులు చేరదీస్తారు, కనిపెట్టి ఆదరిస్తారు, అన్నమాట అబద్ధమనుకోండి.

అవ్వ—అంతేనమ్మా! నిజమే!

వీరిద్దరిమాటలూ విని రవణమ్మ బుసలుకొడుతూ లేచింది.

ఊరుకోండి అవ్వగారూ! ఇంకా అది చేసేపనులకు వీరమ్మగనుక సరిపోయింది కాని మరెవ్వరైనా అయితే ఈ పాటికింట్లోనుంచి వెళ్ళగొట్టేవారే! నిజంగా వీరమ్మంత మంచిదుందా? పైకి వట్టిబడబడలేకాని యెంతమంచి మనస్సు దానిది అని జవాబు చెప్పింది.

చంద్రి—మంచిదో చెడ్డదో ఆవిడచేష్టలే చెపుతాయి! ఆవిడ వికారాలే చెపుతాయి!

రమ—చెపుతాయంటే సరా? ఇంటికి వెళ్ళి చూస్తే తెలుస్తుంది! అది చూపే ప్రేమా, అదిచూపే ఆదరణ మింతాఅంతానా? పెరుగు పోసుకోంటే శాంతికి పెరుగు పోస్తుందికద! ఇంట్లో ఏదైనాచేస్తే ముందు దానికి పెట్టకుండా తిందుకద! ఇంకా తనపిల్లనైనా అల్లాచూడదు!

అవ్వ—నువ్వే చెప్పాలి దానిప్రేమా దాని ఆదరణాను! ఎప్పుడూ ఆవిడ కూడా కూడా తిరుగుతూ వుంటావు కనుక నీకిదీ అదీ పెడుతూంటుంది. అందుచేత నువ్వు ఆవిడకు మంచిదానవు, ఆవిడ నీకు మంచిది. అడపా తడపా కూరో వారో నీకు యిస్తూంటుందని ఆవిడ అందరిని అల్లాగే చూస్తూంటుం దనుకొంటున్నావు కాబోలు! ఆవిడ మరెవ్వరూ కాదు!

పీరమ్మా! ఇంతెందుకు ఏదో పనుండి మొన్న మామనవడితో వాళ్ళింటికి వెళ్ళేటప్పటికి, పాలకాయలు వండుతోంది. అవి చూచి వాడూరికే యేడవడం మొదలుపెట్టాడు. వాడు నా లుక పెరుక్కొన్నా కురాడుకదా, ఒకరెండుకాయలు పెట్ట కూడదూ? తుంచైనా పెట్టలేకపోయింది పీరమ్మ నెరగం?

అవ్వ తన ధోరణ్ని తాను చెపుతూవుండగానే ఆవిడ మాటలు వినిపించుకోక ఛరుద్రిన నీళ్ళబిందెత్తుకొంటూ ఊరుకో, ఎవరైనా నవ్విపొయ్యేరు. పీరమ్మ నాకు కూరా నారా యిస్తూంటుందీ? అంత కూరనారలకు గతిలేనివాళ్ళనుకొన్నావా యేమిటి? ఎందుకువచ్చిన అబద్ధాలమ్మా! ఏళ్ళు వచ్చాయి! రాగానే సరా? చూచీచూడని మాట లనకు. అని రవణమ్మ పేకజువ్వవలె మెగిసిపడింది. అప్పటికీ లోపల పుదేకం ఆగలేకు. మాటలు చరచరవచ్చి ఆగిపోయిన తరువాత ఆవుదేకం నడకంలో కెక్కింది, రవణమ్మ పగపట్టిన తాచులాగ ఛరుద్రిన పోతోంది. అవ్వమాత్రం సామాన్యురాలా?

అవును. చూచానుగనుక అన్నాను. ఉన్నమాటకు పులుకెందుకు? ఏమమ్మా! చంద్రమ్మా! తాను కూరా నారా పుచ్చుకొంటే తప్పులేదు కాని నేనంటే తప్పొచ్చిందేం! అంది.

ఈమాటలు వినవడ్డవి కాబోలు రవణమ్మకు! నోరుందని వాగకు. చూడవస్తే పెద్దదానవుకూడాను. ఎందుకొచ్చి

నపెద్ద. నామర్యాద దక్కించినంతసేపే నీమర్యాద, అని బొబ్బలెట్టింది!

చంద్రి—అవ్వగారూ! వూరుకోండి. రవణమ్మతో ఏమిటి? రవణమ్మంత కజ్జాకోరు లేదు! పరువూ మర్యాద లేదు దానికి!

చంద్రిమ్మకూడా వెళ్ళిపోయింది. అప్పటికింకా రవణమ్మ దిక్కునుంచి ఏవోధ్వనులు వినబడుతూనే వున్నాయి! కాని అవేమిటో స్పష్టంగా తెలియటంలేదు. మరికొంచెం సేపటికి, అందరికంటె ముందొచ్చిన అవ్వ అందరికంటె ఆలస్యంగా యింటికి వెళ్ళిపోయింది. కాని అప్పొద్దున్నల్లా ఆవిడ నోరూరుకోలేదు.

౨

తణుకు డెల్టాగ్రామం. తాలూకా ఆఫీసు, రిజస్ట్రాఫీసు మొదలైనవున్నాయి, వూరంత పెద్దదనలేనుగాని అంత చిన్న దిమాత్రం కాదు. పాడిపంటలు సమృద్ధిగా వుంటాయి అక్కడ!

ఆవూళ్ళో వున్న పేరావధానులుగారిని యెరగనివారు ఆచుట్టుప్రక్కల లేరు. వేనంగిమరమ్మతులకు నరసాపురం కాలువ కట్టివేసిన నెల్లాళ్ళూ ఆయన పెరవలిలో అన్నసత్రం. చలివేంద్రిపెట్టి అష్టాదశవర్ణాలకూ బాటసారులకూ అన్నప్ర దానం చేసి, దాహాలిస్తూండేవారు! ఆరోజుల్లో ఆయన పెంద

రాడే ఉదయం పదిగంటలకు భోంచేసి సత్రానికివెళ్ళి అక్క-డేవుండి జంఝాలు వడుక్కుంటూనో, లేకపోతే మెడంవైపు కాడ వూడిపోయిన సులోచనాలజోడుకి తాడుకట్టి చెవికి తగిలించుకొని ఏభాగవతరామాయణాలో చదువుకొంటూనో, వచ్చిన అతిథులతో వూరేసిన వుసిరిగాయ ఇద్దునా? నిమ్మకాయపిండిన మజ్జిగతేట వుంది. కొంచెం పుచ్చుకోండి. దూరం వెళ్ళాలి గుప్పెడు మెతుకులు తినిపోగూడదూ? అంటూ వారి వారి రీతులకు తగినట్టు పరామర్శిస్తూ కాలక్షేపం చేస్తూవుండేవారు! అందువల్ల పేరావధానులుగారి సత్రం విశేషప్రఖ్యాతి! ఏదో! కష్టపడకుండా కాలిమీద కాలేసుకొని కూర్చొని, తాను తిని, పదిమందికి పెట్టగలస్థితి! ఆ వేసవికాలంలో రెండు నెలలూ అంతే! ఆపైన యింత భారీతనం ఉండేదికాదు! ఏమైనా ఆయనపే రెరగనివారు లేరు, ఆప్రాంతంలో.

ఆయనభార్య వెంకమ్మకూడా మగడు సత్రానికింత ఖర్చుచేస్తున్నాడని ఏమీ అనేదికాదు. ఆవిడధోరణి ఆవిడది. గదులూ సావిళ్ళూ అలుకు లలకడం, పొయిలు మెత్తడం, తట్టలకు పేడపూత పూయడం, పిల్లలకూ పాపలకూ తలలు దువ్వి నీళ్ళుపోసి బొట్టుపెట్టి సింగారించడం, వీటితోటే సరిపోయే దావిడకు! ఇంకాఎప్పుడైనా ఆవిడకు తీరికున్నట్లయితే అంతర్వేది తీర్థంలో అర్ధణా అర్ధణా అణా అణా పెట్టికొని,

తనపుట్టింటారు కాపరాని కొచ్చేటప్పుడు వుండ్రాజవరంతీర్థంలో కొనియిచ్చిన కొయ్యపెట్టిలో భద్రంగా దాచివుంచిన చిలుకుముగ్గులపాట, లంకాయాగం, తులసిగోవిందనామాలు, సీతసమర్త, లక్ష్మణదేవరనవ్వు, రుక్మిణీదేవి ముచ్చట్లు, సత్యభామ సరసము, కౌసల్యవేవిళ్లు, లక్ష్మీదేవి సొగటాలాట, ఇల్లాంటివి, బైటికితీసి చదువుతూ వుంటుంది. శ్రావ్యమైన కంఠం, వాటిలో కొన్ని ఆవిడకు కంఠతావచ్చు! ఇరుగుపొరుగు అమ్మలక్కలు వచ్చి పాటలు చెప్పించుకొనేవారు. కొందరు పాడుతూంటే వినడానికి వచ్చేవారు. అర్ధణాకానంతబొట్టుతో, పండుతమలపాకువన్నె శరీరంతో, బందరద్దకం పెడనచీర కట్టుకొని, చుక్కలరవిక తొడుక్కొని, పిల్లలిని వెంటేసుకొని ఆవిడ శ్రావణమంగళవారాలు పేరంటానికి వెడుతుంటే సాక్షాత్తు లక్షిందేవమ్మలా వుండేది! ఆవిడకు ముగ్గురుకొడుకులూ, ఇద్దరుకూతుళ్ళూను! పెద్దకొడుక్కి పదిహేనేళ్ళు నిండినవి. పెద్దపిల్లకు తొమ్మిదేళ్ళు కడసారిపిల్లకు అయిదేళ్లు.

పేరావధానులికి తమ్ముడున్నాడు. అతనిపేరు శాంభోట్లు. చిన్నతనంలోనే తల్లీతండ్రీ గతించారు. అప్పటినుంచి అన్నగారే అతన్ని ఆదరించి చదువుకొంటే బాగుపడతాడని పారి శాస్త్రుల్లుగారి దగ్గరికి కావ్యాలు చెప్పించడానికి కాకరపర్రు పంపించాడు. కాకరపర్రు మొగలతుర్తురాజులు కలి

చింది వారికి పూర్వంనుంచీకూడా గొప్పవిద్యాపీఠకమని పేరు పడింది! అక్కడ దిగ్గజాలలాంటి పండితులుండేవారు. ఆ వూళ్ళో యెప్పుడూ కనీసం వందమందికి తక్కువవుండేవాళ్లు కారు విద్యార్థులు. వారంతా అక్కడే వారాలు చెప్పకొంటూ, చదువుకొనేవారు. కాంభొట్లుకూడా ఆవిద్యార్థులతో చేరి చదువుకొనేవాడు. కాని పెద్దపెద్దపోకడ లుండడంమూలాన్ని చదువుమీద ధ్యానంలేక, ఎన్నాళ్లయినా రామశబ్దంలో రామాభ్యాంని దాటనేలేదు! ఇల్లావుండగా ఆఊరు ఎవరో బైరాగివచ్చాడు! సిద్ధుడు, యోగి అంటూ పాటక జనం ఆయనచుట్టూ మూగుతూ, పళ్ళూ !పాలూ ఇస్తూ ఆయనదగ్గరనుంచి వీభూతి తీసుకొనేవాళ్ళు! కాంభొట్లుకూడా కాస్సేపో కూస్సేపో ఆబైరాగిదగ్గర వినోదం చూస్తూ కూర్చొని చక్కావచ్చేవాడు. రోజులిల్లా గడుస్తూంటే కాంభొట్లుకి బైరాగిమీద భక్తికుదిరి ఆయనమీదవుండెదృష్టి గురువుగారిమీదకాని చదువుమీదకాని వుండేదికాదు. హరిశాస్త్రుల్లుగారు చాలా మందలించారతన్ని! అతడికి చాలాసార్లు హితబోధచేశారు, కాని అవేవీ అతడి చెవికెక్కలేదు. వారాలిచ్చేవాళ్లకి అతడిచర్యచూస్తే దుస్సహ మవుతోంది. ఈలోపుగా ఎవరోవచ్చి ఆబైరాగికి బంగారం చెయ్యడం తెలుసునని కాబోలు కాంభొట్లు చెవులో ఊదారు. ఇంకేముంది? అప్పటినుంచీగురువూనై. పోయి బైరాగిదగ్గరే కాపరం!

ఎల్లాగైనా ఆతడి శుశూ్రిషచేసి ఆవిద్య నే ర్చుకోవాలని కాంభోట్లు ఘట్టిపట్టుపట్టాడు! ఈలోపుగా ఆవూళ్ళో వున్న రైతులు కొందరు, పరోపకారబుద్ధి కలవారు. చంద్రగ్ర హాణం వస్తే బైరాగిదగ్గర తేలుమంత్రిం, పాముమంత్రిం నే ర్చుకొన్నారు. శబ్దమంజరైనా చదవని వీళ్లే మంత్రాలు నేర్చుకొంటూ వుంటే కాస్తోకూస్తో డొక్కశుద్ధికల నే నెందుకు ఈమంతా్రిలు నేర్చుకోకూడదని కాంభోట్లుకూడా తేలుమం త్రిం ఉపదేశమయినాడు బయిరాగిగురువుగారి దగ్గర! ఆబై రాగితోటి చిరసహవాసంవల్ల ఏదబ్బినా ఏదబ్బకపోయినా గంజాయి తాగడం బాగా అలవాటయింది. ఈవిధమైన అల వాటులు మరిగిన తరువాత :ఇంకాతడు గురువుగారి ముఖమే చూడడం మానుకొన్నాడు. ముందరిపక్క కకపాలవుంచుకొ ని భిక్షాపాత్రలో భస్మం వుంచి వొళ్ళంతా వీభూతి పూసు కొని అరమోడ్పుకళ్ళతో గంజాయి తాగుతూ మధ్యమధ్య ఆచిలుముగొట్టం కాంభోట్ల కందిస్తూంటే అతడుకొంచెం పైన నొక్కికి్రందిగుడ్డపీలికె జాగ్రత్తగా మడిచి, రాం,రాం. అంటూ పీల్చగలిగినంతవరకు ఒక్కదమ్ము పట్టి, మెల్లగా ఆపొగ వదలి పెడుతూ ఆబయిరాగి, అనుభవించే ఆనందం అది ఇల్లాంటి దని చెప్పడానికి కెవరితరం? అప్పుడతన్ని చూచేతీరాలి! ఇల్లాచాలారోజులుగడిచాయి, బయిరాగికిప్పుడు కాంభోట్లు నమ్మినశిష్యు డవడంచేత బయిరాగికివచ్చేఫలహారాలలో న

గంపాలు కాఁభొట్లదే! చూచేవాళ్ళకు బయిరాగితరువాత మళ్ళీ ఆపీఠం ఇతడే ఆక్రమిస్తాడా అనిపించింది. ఆతీర్థం సేవించుకొనిబయిరాగి వెంటపాడువెళ్ళాడు. కూడా కాంభొట్లూవెళ్ళాడు. ఇంకొకడు కలిశాడురా. లోకం బాగుపడు తోంది అని అక్కడి బయిరాగులు సంతోషించారు.

ఈసంగతంతా పేరావధానులగారికి తెలిసి వెంటపాడువెళ్ళి కాంభొట్లు నింటికి తీసుకువచ్చేటప్పటికి బ్రహ్మాండమయింది! అప్పటికే చిలుంగొట్టముతోగల అనుసంధానం మూలాన్ని కాంభొట్లుకు సగంవైరాగ్యం తలకెక్కింది. నేనింటికి రానంటే రానన్నాడు. ఎట్టాగైతేం పేరావధానులుగారతన్ని యింటికి తీసుకువచ్చి కృతకృత్యుడైనాడు. ఇంకవీన్ని ఇల్లా వుంచుతే ఎక్కడికి పారిపోతాడో అని అన్నగారు కష్టపడి ఒకపిల్లను చూచి కాంభొట్లుకి ముడిపెట్టేశాడు. అలాగైనా కొంచెం కుదిరిక వస్తుందేమో అని.

పెళ్ళయిం తరువాతకూడా ఎప్పటి ఆటే! ఏసంతకో ఏసావిడికో వెళ్ళి తెచ్చినపత్రి ఏచాటునో ఏమూటునో ఎక్కడో కూర్చుండి విని మోగంచేస్తూండేవాడు. కాని పత్రికింటిదగ్గరనుంచి డబ్బుదొరకేది కాదు కాంభొట్లుకు! అయితేయేం? అస్తున్నవాడు గనుక ఎవరుపడితేవారు బదులిచ్చేరు! తమ్ముడు బదుళ్ళు చేస్తున్నాడని పేరావధానులు గారికి తెలియలేదు. కాంభొట్లుకు కాలక్రమాన్ని ఆవూళ్ళోనే గం

జాయికితోడు బేస్తాటస్నేహితులుకూడా దొరికారు. వారు క్రమంగా నాలుగురోజుల్లో ఆతన్ని రంగానికి తయారుచేశారు. ఇప్పు డహర్నిశాలు ఆతనికి తీరికే లేదు. ఇదికూడా బాగా వుంది కాదని పేరావధానులుగారు పెళ్ళిచేసిన కొన్నాళ్ళకే పిల్లపెద్దదై వుండడంచేత చివరకు వైశాఖమాసంలో కార్యం కూడా చేసి మరదలిని తణుకు తీసుకువచ్చారు. పెళ్ళాం వచ్చి నతరువాత కాంభొట్లు కొంచెం ఇంటిపట్టున వుంటూవచ్చినా తనచిలుం గొట్టం తనపేకముక్కా మరచిపోలేదు !

ఇల్లావుండగా జాడ్యాలు వచ్చాయి. గొట్టాలమ్మ జమాబందీ ప్రారంభించింది. వూళ్ళో ఇంటింటికి గోడలకు పసుపురాసి కుంకం పట్టీలు వేపతోరణాలు కట్టి పెడుతున్నారు. అమ్మవారిని తీసుకువచ్చి నడివీధిలో పూరిగుడిసెలో నిలబెట్టారు. చల్లఘటం బైలుదేరింది! అంతా అమ్మవారికి చల్దినైవేద్యాలు పెడుతున్నారు. వేటపోతు గెరగల నిస్త్రానునీ మొక్కుకుంటున్నారు. పైడిబెత్తాలతో వేపచెత్రలతో గణాచారులు బైలుదేరారు. ఊరికి పొలిమేర్ల వేపతోరణాలు కట్టారు. ఊరంతా గజిబిజిగా వుంది. ఇంతచేసి నాకాని రోజూ లెక్కలేనంతమంది జనం పోతున్నారు. చావులకు పరిమితి లేదు. రెండుఘడియల రాత్రిఅయ్యేసరికి యెవ్వరూ తలుపులు తీసివుంచడంలేదు. అమ్మవారు నల్లచీర కట్టుకొని, చీపురూ చేటా పుచ్చుకొని, ఘల్లుఘల్లు మంటూ రాత్రిళ్ళు వీధిలో

తిరుగుతోందని చెప్పుకోవడం మొదలు పెట్టారు జనం. గార్నమెంటువారు నూతులన్నిటిలో పొటాసియం పర్మాంగనేటి పలుకులు వేసి వారికాపుదలమీద వారున్నారు. నీళ్ళు బాగా కాచివడపోసి తాగవలసిందని వూళ్ళో దండోరా వేయించారు. ధర్మాత్ములైనవాళ్ళు కలరామందులు తెప్పించి యిస్తున్నారు.

వూరింత గందరగోళంగా వుండగా, వెంకమ్మకూడా ఒక ఆదివారం తెలకపిండికూర వండి, పునుకులవంటివి చేసి, అమ్మవారికి నైవేద్యం పెట్టి సావిట్లోకూర్చొని పిల్లలకు తల దువ్వుతోంది. ఇంతలో పొరుగమ్మ రామమ్మ ఇంత వత్తి ముగ్గు పోసిన కొబ్బరిచిప్పా తీసుకొని ఏమర్రో! తోడికోడళ్ళేం జేస్తున్నా రేమిటి? పనిపాట్లయినాయా? అంటూ వచ్చినది.

అవ్వగారా! రండి. ఇప్పుడే తిళ్ళూ తిప్పలూ అయినాయి, అమ్మవారి కన్నాళ్ళనుంచో నైవేద్యం పెట్టాలనుకొంటున్నాను. ఎప్పటికప్పుడు మరిచిపోతూనే వున్నాను. ఈవేళ జ్ఞాపకం వుంచుకొని యింత కూరా పప్పూ ఏవో పునుకులూ చేసి నైవేద్యం పెట్టి పిల్లలకు తిళ్ళూ తిప్పలూ కానిచ్చి యిప్పుడే బైటపడ్డాను. ఇదిగో ఈశిఖండి ఎన్నిమాట్లు తలదువ్వుతా నన్నా దువ్వించుకోదు. తలలో పేలుపట్టినవి. బలవంతాన్ని పట్టి కూర్చోపెట్టేటప్పటికి నాతాతలుదిగొచ్చారు. అని వెంకమ్మ బదులుచెప్పింది.

అంతే. మాచిన్నపిల్ల లచ్చివుందా అదీ, అంతే! అబ్బె బ్బే! వీళ్ళు పిల్లలంటే పిల్లలు కారమ్మా! ఏదీ మీతోడి కోడ లేదీ వీరమ్మ? అని పిల్లకు తలదువ్వతూ వున్న వెంక మ్మ కెదురుగా నట్టింటిగుమ్మం దగ్గర గోడ కానుకొని వత్తులు చేసుకొంటూ కూర్చుంది అవ్వ!

మామరది ఇప్పుడే వచ్చాడు. అన్నం పెడుతోంది.

ఇందాకా యేంజేస్తున్నాడు మరిది?

ఏమో యేంజేస్తున్నాడో, యేం రాచకార్యం వొలికి పోతోందో, ఇంటిపట్టున కాస్సేపు వుండడు. ఇంటిపనిలో కాస్తంత జోక్యం కలిగించుకోడు. అంటే కోపాలు.

పొద్దున్న వీరమ్మెందుకు యేడుస్తోంది?

ఎందుకా? తీపుతీసి ఎందుకేమిటి? ఆమంచంమీద యీమంచంమీదా దొర్లుతూ ఆనవలా యీనవలా చదవక పోతే కాస్తంత పైపని చెయ్యకూడదా? పెద్దదానవైనా ఏక కూర్చోడమేనా! పోనీ పిల్లలకేనా తలదువ్వి నీళ్ళుపోయకూ డదా అన్నాను. దానికికోపం వచ్చి మీదపడి కొట్టినట్టుగా రాగాలెడుతూకూర్చుంది. ఇంకా అంటే యీయింటికి ఆయిం టికి వెళ్ళి మాతోడికోడలు బతకనివ్వటం లేదనిచాటి చక్కా వస్తుంది.

అవును. పోని పైపని చేయకపోతేమానె పిల్లలనైనా చేరతీయకూడదూ?

పనెవరికి కావాలి? ముష్టిపని! నేనూ అదే అనడం! పిల్లలను తీయకూడదా అని! ఏం చిన్నదా! చితుకదా, పది హేనేళ్ళు పదహారేళ్లు పైకొచ్చాయి. ఎందుకూ ఏమన్నా అంటే రవ్వా రట్టూను! అదేమిటో? పిల్లలినిచూస్తే అసలే కిట్టదు!

ఊరుకో, వస్తుందేమో అని మెల్లిగా అంది అవ్వ!

భయంలేదు. దూరంగా వుంది. వంటపంచపాళీలో వినపడదులెండి, ఏమిటో ఇంతకూ ఇంటివ్యవహారా లేం బాగున్నాయి కావు. వాగ్రిత వొచ్చింది గనక ఏమన్నా అన్నావంటే ఇంటికి తల్లికొరక వృత్తిరం వాగ్రిసేస్తుంది. ఇల్లంతా యమలోకంలా వుంది. పైకిఅల్లా వుంటుంది కాని మాచెడ్డపిల్లండో! మరి దింటికి వచ్చేటప్పటికి నామీద పితూరీలతో సిద్ధం. ఇంకెన్నాళ్ళో కలిసి వుండంలెండి! అయితే వేరవడానికి మావారి కేమీ యిష్టంలేదు! ఆమాట నాచెవిని పడకూడ దంటారు!

అవును. మరి కలిసివుండడం మంచిదికాదూ మరి. మారోజుల్లో యిల్లాంటి జగడా లెరుగం సుమా! ఉండేవారనుకో అప్పుడూ యిల్లాంటివాళ్ళు కాని ఆదారి వేరు ఈదారివేరు. రాను రాను లోకం తెలుగుమీరి పోతూవుంది. భయమూ భక్తి లేదు పెద్దా చిన్నా అనే తారతమ్యం లేదు. ఇప్పటివాళ్ళని ఏమీ అనలేమమ్మా! వాళ్ళకే మనం లొంగివుండాలి.

ఎవరు లోంగివుంటారండీ! ఈయిల్లు తనదిమాత్రం కాదటండీ! తనకు మాత్రం బాధ్యత లేదు!

ఊరుకో, వస్తూన్నట్టుంది! చూడు నువ్వుచెప్పిన నాలుగుముక్కలూ తులసిగోవింద నామాలు మరచిపోయాను సుమా! వెనుకటి జ్ఞాపకశక్తిలేదు! ఇప్పుడిక్కడ పెట్టిన వస్తువు ఎక్కడవుందో అని వెతుక్కొంటాను.

పెద్దవారైనారు.

అంతా దిగనారుకొచ్చింది. వచ్చేకాలమా పొయ్యే కాలమా! ఏదో నామనమరాలి కడుపునోకాయకాస్తే చూదామని అంటిపెట్టుకొంది యీజీవుడు; అంతేకాని అంతకంటె యేమీ లేదు.

చెప్పుకోండి మళ్ళీ పాడుతాను.

మొదటిచరణాలే జ్ఞాపకం లేవు. చివరవి జ్ఞాపకమున్నాయి కాస్తో కూస్తో.

వెంకమ్మ అన్నీ పాడుతాను. చెప్పుకోండి, అని యిల్లా పాడింది, భక్తితో తులసికీ-గోవిందా రామ.

పాడు అయినా చేస్తు-గోవిందా
కృష్ణతులశమ్మకూ-గోవిందా రామ
మొక్కులైనా చేస్తు-గోవిందా
భాగీరథీ నీరు-గోవిందా రామ
ధమిడీ బిందెల బోతు-గోవిందా

పాదాలు కడిగియూ-గోవిందా రామ

పైజల్లుకొందునూ-గోవిందా

ఈవిధంగా వెంకమ్మ పాడుతూ వుంటే నరసమ్మ అందుకొని పాడడం మొదలుపెట్టింది, కొన్నిచరణా లయిన తరువాత ఇంకిక్కడనుంచి నాకు జ్ఞాపకం వుంది లే. నేను పాడతాను విను. తప్పులుంటే దిద్దు అని రామమ్మ పాడడం మొదలుపెట్టింది. కొంచెంసే పయేటప్పటికి పైలాడు అన్నానికివచ్చాడని కేకేస్తూ వచ్చి లచ్చి అవ్వ నింటికి పిలుచుకొని వెళ్ళింది. అవ్వ వెళ్ళిన మరికొంచెం సేపటికి వెంకమ్మపెద్దకొడుకు ఎక్కడికో వెళ్ళి చదువుకొంటూ వున్నవాడు వచ్చి అమ్మా! ఇందాకా నాకొక విరోచనమైందే, అన్నాడు. ఆమాటతో వెంకమ్మ గుండెల్లో రాయపడినట్లయింది. ఇంకా అప్పటికి వూళ్లో తొందరలు అణగలేదు. ఎప్పుడు అని వెంకమ్మ కొడుకును దగ్గరికి జేరదీసి ఆదుర్దాతో అడుగుతూ వుండగానే అనుమానంగా వున్నదని మళ్ళి వెళ్లాడతడు. ఇల్లా సాయంత్రం అయేటప్పటికి నాలుగు విరోచనాలై చూస్తూ చూస్తూ వుండగా ఆతడ స్తమించాడు. చెట్టంత కొడుకు పోతే వెంకమ్మ దుఃఖం చెప్పడానికి తరమా! తండ్రికి చేతికెదిగినవాడుకూడాను. ఆరాత్రి ఇంకా ఆశవం యింటిలోనుంచి వెళ్ళిందో లేదో వెంకమ్మ రెండోకొడుక్కి కలరావచ్చింది. ఈవిధంగా నాలుగురోజులలో ఆయింటిలోనుంచి నాలుగుశవాలు